Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 03.03.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 39 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




## ఔను... నిజమే...

# ఇంకెన్నాళ్ళు ఈ చెత్త పనులు

- తెలుగుదేశం పార్టీలో టిక్కెట్లు కావాలంటే... వేల కోట్ల ఆస్తులన్నా ఉండాలి... లేదా బ్యాంకులకు వందల కోట్లు అప్పలన్నా ఉండాలి
- 'దేశం'లో పెరుగుతున్న కార్పొరేట్ సంస్కృతి
- పార్టీలో సీనియార్టీకి, సిన్సియార్టీకి సమాధి

రాజ్యసభ టిక్కెట్ కావాలా నాయనా... తెలుగుదేశం టిక్కెట్ కావాలంటే ఇవే అర్హతలు... కనీసం వెయ్యి కోట్లన్నా బ్యాంకులకు అప్పుండాలి, కార్పొరేట్ కంపెనీలకు అధిపతై ఉండాలి. ఎగ్గొట్టిన వేలకోట్లలో నుండి పార్టీకి రెండు మూడొందల కోట్లన్నా ఖర్చు పెట్టాలి. గమనిక : రాష్ట్ర శాసనమండలి సీటును అభ్యర్థిస్తున్న నాయకులకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. ఇట్లు... ఏ.పి. తెలుగుదేశం పార్టీ.

(మిగతా 11వ పేజీలో)



## ఉత్కంఠ రేపుతున్న

# స్థానిక పోరు

- రసవత్తరంగా మారిన మండలి పోటీ
- 'దేశం' నేతల్లో వాకాటి ఎంపికపై తీవ్ర అసంతృప్తి
- ఆనం విజయకు అనూహ్యంగా పెరుగుతున్న మద్దతు
- 'దేశం' వర్గాల నుండీ పరోక్ష సహకారం
- వ్యక్తిత్వంలోనూ ఈ విజయకుమారే మేటి!

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు రిహార్సల్స్‌గా చెప్పుకోదగిన స్థానిక శాసనమండలి పోరుకు రేసుగుర్రాలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలోనే నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి పోరు రసవత్తరంగా మారింది. ఎందుకంటే ఇక్కడ అధికార తెలుగుదేశంకు ఏ మాత్రం తగ్గకుండా వైయస్సార్ కాంగ్రెస్ గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో జిల్లా రాజకీయాలలో తమదైన ముద్రవున్న ఆనం కుటుంబానికి చెందిన ఆనం విజయకుమార్‌రెడ్డిని రంగంలోకి దించింది.

ఇక తెలుగుదేశం అయితే కొన్ని రోజులు డ్రామాలు నడిపి చివరకు తాము అనుకున్న వాకాటి నారాయణరెడ్డినే అభ్యర్థిగా రంగంలోకి దించింది. ఈయన సిటింగ్ ఎమ్మెల్సీ! అంతకుముందు ఆనమోళ్ళ పుణ్యాన కాంగ్రెస్ ఎమ్మెల్సీగా 9ఓట్ల తేడాతో గెలిచాడు. అది కూడా అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండింది కాబట్టి ఓట్ల లెక్కింపులో

(మిగతా 11వ పేజీలో)







# జంపింగ్‌లకు ఝలక్

- గవర్నర్ కోర్టులో దేశం వైసిపి ఎమ్మెల్యేల బంతి
- మంత్రి కావాలంటే రాజీనామాలు చేయాల్సిందే!
- తెలంగాణలో నీతి ఏపిలో వర్తించదా?

12లో

- చినబాబుకు పెదకుర్చీ

# నా దారి... అడ్డదారి!



ప్రజాక్షేత్రంలో గెలవనివాడు, ప్రజల అభిమానాన్ని పొందనివాడు ప్రజానాయకుడు అవుతాడా...? కాలేదు, ఎప్పటికీ కాలేదు. దేశానికి ఇందిరాగాంధీ, వాజ్‌పేయి, ఇప్పుడు నరేంద్ర మోడీ... ప్రధానులుగా పని చేసారు. పని చేస్తున్నారు. అలాగే మన్మోహన్‌సింగ్ కూడా ప్రధానిగా చేసారు. కాని వాళ్లకు మన్మోహన్‌సింగ్‌కు ఎంత తేడా? వాళ్ళు ప్రజాక్షేత్రంలో గెలిచారు. తమ పార్టీలను గెలిపించారు. మరి మన్మోహన్‌సింగ్... పదేళ్ళు ప్రధానిగా చేసినా రాజ్యసభ సభ్యుడి హోదాలో ఆ పదవిలో కూర్చున్నారే గాని, ఒక్కటంటే ఒక్కసారి కూడా లోక్‌సభ ఎన్నికల పోరులో నిలబడి ప్రజల్లో తనకేపాటి ఆదరణుందో నిరూపించుకోలేదు.

(మిగతా 11వ పేజీలో)

# పసుపు ముద్ర పడితేనే పింఛన్!

నువ్వు అర్హుడివే... నువ్వు ఎనభై ఏళ్ల పండుటాకువే... నువ్వు రెండు కాళ్లు లేని వికలాంగుడివే... భర్తను కోల్పోయిన వితంతువువే... అయితే మాకేంటి... పింఛన్ కావాలంటే పసుపు ముద్ర పడాలి. ఋణం పొందాలంటే పసుపు స్టాంప్ పడాలి. ఇదీ పింఛన్‌లు, ఋణాల మంజూరు విషయంలో అధికారుల వ్యవహారశైలి. పింఛన్ కావాలన్నా, ఋణం దక్కాలన్నా అర్హతలతో పని లేదు. పచ్చ నాయకుల ఆమోదం ఉంటే చాలు. పచ్చ తమ్ముళ్ల ఆజ్ఞ లేనిదే అర్హులకైనా, పూటగడవని పేద వృద్ధులకైనా పింఛన్‌లు మంజూరు కావడం లేదు.

వివరాలలోకి వెళితే నెల్లూరు కార్పొరేన్ పరిధిలోని 32వ డివిజన్ పరిధిలోని అంబాపురం, శ్రీలంకకాలని, ఓగూరుపాడు, అక్కచెరువుపాడు, రామకోటయ్య నగర్, కావేరి నగర్, విజయలక్ష్మి నగర్, గాదంశెట్టి రోశయ్య నగర్, లాయర్స్ కాలనీ, టైలర్స్‌కాలనీ, నిర్మలనగర్ తదితర ప్రాంతాల్లో 75మంది అర్హులైన వాళ్ళు పింఛన్‌లకు దరఖాస్తులు చేసుకున్నారు. 2014లో వీళ్లు దరఖాస్తు చేసుకోగా, కేవలం స్థానిక అధికారపార్టీ నాయకులు చెప్పిన వాళ్లకే పింఛన్‌లు ఇచ్చారు. ఇలానే 20మంది వరకు అర్హులైన వృద్ధులు పింఛన్‌లు రాక ఇబ్బంది పడుతున్నారు. కొందరు వృద్ధులైతే కన్నబిడ్డలు చూడక, పింఛన్‌లు లేక పస్తులతో ఉంటున్నారు. ఇట్లాంటి వాళ్ళ పట్ల కూడా కనికరం లేకుండా పింఛన్‌లు ఇవ్వకపోవడం అన్యాయం.

సింహపురి సమాచారం

# మానవాళి అభ్యున్నతికి సైన్స్ కీలకం

## - విఆర్‌సిలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం




మానవాళి అభ్యున్నతికి సైన్స్ ఎంతో కీలకమని విఆర్‌సి ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. నెల్లూరులోని విఆర్‌కళాశాల సెమినార్ హాలులో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన తొలి భారతీయుడు, భారతరత్న సర్. సివి.రామన్ ఎంతో గొప్ప శాస్త్రజ్ఞుడని, భావితరాలకు ఆయన మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమానికి గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాబర్ ఆలీమొహిద్దీన్ అధ్యక్షత వహించారు. జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎం.పద్మప్రియ, కెమిస్ట్రీ లెక్చరర్ ఎన్.హనుమంతకుమార్ మాట్లాడారు. విశ్రాంత భౌతిక శాస్త్ర రీడర్ డాక్టర్ పి.మల్లికార్జునరెడ్డి, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కృష్ణకిశోర్, బి. వేమారెడ్డి, లైబ్రేరియన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్, అధ్యాపకులు డాక్టర్ జి.వేణు, డాక్టర్ జి.సురేంద్ర, పి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఎన్.గోపి, డి.శ్రీవాణి, ఎ.బాబు తదితరులు పాల్గొన్నారు.


**FORM IV**

(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Maguntа Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2017 SIVA PRABHATH REDDY.T


### ఉచితంగా

# బి.పి, షుగర్ పరీక్షలు



నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం దాదాపు 300 మందికి ఉచితంగా బి.పి, షుగర్ టెస్టులు నిర్వహించి మందులు అందజేశారు. విజయా మిల్క్ డెయిరీ మేనేజర్ పి.ఎల్. ప్రసాదరావు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, డా॥ అంకిరెడ్డి, శ్రీనివాసకుమార్, ఎం.ఎస్.రెడ్డి, సత్యనాథ్, కోటేశ్వరరావు, నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు

# శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు కొండాయపాలెం దళితవాడ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుల్లి శాస్త్రవేత్తలు – 2017 వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. తొలుత సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ప్రదర్శనను నిర్వహించడాన్ని అభినందించారు. అనంతరం ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నెల్లూరు నగర డిఎస్పీ వెంకటరాముడు, ఎంఇఓ జగదీశ్వర్, నెల్లూరు నగర కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రవి, మేనేజర్ గిరిజ, స్కూలు ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కరరావు, ఉపాధ్యాయులు హరీష్, సృజిని, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా 'దేశం'లో...

# రాజుకుంటున్న అగ్గి

- **నెల్లూరుజిల్లాలో తొలి జంపింగ్ బోణీ**
- **వైసీపీలోకి ఇందుకూరుపేట ఎంపిపి, ఇద్దరు ఎంపీటీసీలు**
- **అయోమయంలో పడ్డ తెలుగుదేశం నాయకులు**

***ఇప్పటివరకు జిల్లా తెలుగుదేశంపార్టీలో నివురుగప్పిన నిప్పులా వున్న అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమంటుందా? అసంతృప్తిని, అవమానాల్ని తట్టుకుని ఇంతకాలం నిలబడ్డ నాయకులు తమలోని ఆవేశాన్ని బద్ధలు చేస్తున్నారా? జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే నిజమేననిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా తెలుగుదేశంలో రాజుకుంటున్న అసంతృప్తి, పెరుగుతున్న విభేదాలు, బయటపడుతున్న మనస్పర్ధలు ఆ పార్టీ నాయకులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.***

స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలంటే... ప్రతిపక్షం ఆత్మరక్షణలో పడాలి. తమ సభ్యులను కాపాడుకోవడానికి క్యాంప్‌లు పెట్టాలి. వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. కాని, నెల్లూరుజిల్లాలో అధికారపక్షం ఆత్మ రక్షణలో పడింది. మెజార్టీ ఓటర్లున్నప్పటికీ వారిని కాపాడుకోవడం అధికారపార్టీకి సవాల్‌గా మారుతోంది. ముఖ్యంగా ఈ ఎన్నికలను ఆధారంగా చేసుకుని స్థానిక నేతలు తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు లేదా ఇన్‌ఛార్జ్‌లతో ఇతర నాయకులకున్న విభేదాలు వీధికెక్కుతున్నాయి. ఇలాంటి విభేదాలకు తొలుత కోవూరు నియోజకవర్గంలోనే అంకురార్పణ జరిగింది. ఈ నియోజక వర్గంలోని ఇందుకూరుపేట మండలం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసారు. ఎమ్మెల్యే పోలంరెడ్డి తమకు సమస్యలు సృష్టిస్తున్నాడని, తమ పనులు కానీయకుండా, బిల్లులు రానీయకుండా అడ్డంపడి ఇబ్బంది పెడుతున్నాడంటూ ఎంపీపీ, ఎంపీటీసీలు ధ్వజమెత్తుతూ వైసిపిలో చేరారు. 2వ తేదీ హైదరాబాద్‌లోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఇందుకూరుపేట ఎంపిపి కైలాసం రేణుక, ఎంపిటిసి సభ్యులు పాలెపు వెంకటసుబ్బమ్మ, కైలాసం సుప్రియ వైసిపిలో చేరడం జరిగింది. వీరితో పాటు మాజీజడ్పీటీసీ కైలాసం ఆదిశేషారెడ్డి, మండల నాయకులు కైలాసం వెంకటకృష్ణారెడ్డి, లేబూరు వెంకురెడ్డి తదితరులు తెలుగుదేశాన్ని వీడి వైకాపా కండువాలు కప్పుకున్నారు. వీరిని వైసిపిలో చేర్చడంలో కోవూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగా స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డిలు కీలకపాత్ర పోషించారు.

ఈ పరిణామంతో జిల్లా తెలుగుదేశం నాయకులు బిత్తర పోయారు. ముందు వైకాపా నుంచి స్థానిక సభ్యులను లాగడం మాట అటుంచి, తమ స్థానిక సభ్యులను కాపాడుకోవడానికి క్యాంపులు పెడుతున్నారు. తెలుగుదేశంలో అసంతృప్తికి ఇందుకూరుపేటలో బోణీ జరిగింది. ఈ బాటలోనే ఇంకొంతమంది నడిచే అవకాశాలున్నాయి. ఎమ్మెల్సీగా వాకాటి అభ్యర్థిత్వం పై పార్టీలోని సీనియర్ నాయకులు ఆగ్రహంతో వున్నారు. ఏళ్ళ తరబడి పార్టీకి చాకిరి చేస్తున్న వాళ్లు ఎంతో మంది ఉండగా వారందరినీ కాదని వాకాటిని నిలబెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీళ్లంతా రేపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాకాటికి వ్యతిరేకంగా పనిచేసినా ఆశ్చర్యపోబల్లేదు.

# బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు



నెల్లూరు నగరంలోని పలువురు ప్రతిభగల బ్రాహ్మణ విద్యార్థులకు స్థానిక టివిఎస్ కల్యాణసదన్‌లో సోమవారం ఉపకార వేతనాలను పంపిణీ చేసి వారి అభ్యున్నతికి తమవంతు చేయూతనందించారు. పేదబ్రాహ్మణ ఉన్నతవిద్యా సహాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 130మంది విద్యార్థులకు 2 లక్షలా 60వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టివిఎస్ కల్యాణ్‌సదన్ ట్రస్టీ–ఛైర్మెన్ డాక్టర్ పి.ఎస్.ఆర్.కె మూర్తి, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్, ఏ.పి బ్రాహ్మణ కార్పొరేషన్ కన్వీనర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, న్యాయవాది టి.శ్రీనివాసరావు, బి.సతీష్‌కుమార్‌లతో పాటు, పేదబ్రాహ్మణ ఉన్నత విద్యాసహాయక ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు వరప్రసాదరావు, యనమండ్ర నాగదేవిప్రసాద్‌లు పాల్గొన్నారు. అనంతరం, ఇటీవలే తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఆధ్వర్యంలో ఎంతో విశిష్టమైన 'మహామహోపాధ్యాయ' బిరుదును పొందిన ప్రముఖ పండితులు డాక్టర్ చింతలపాటి పూర్ణానందశాస్త్రిని ట్రస్ట్ తరపున అభినందించి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

# మహా సంరంభంగా 'మహాశివుని' వేడుకలు

- ఆధ్యాత్మిక సారధి "సుబ్బరాముని" ఆధ్వర్యంలో అంబరాన్నంటిన సంబరాలు
- పరవశించిన భక్తజనం... పులకించిన విశాఖ సాగరతీరం





మహాశివరాత్రి పర్వదినం నాడు విశాఖ సాగరతీరం పులకించిపోయింది. అశేష భక్తజనసందోహం ఆ పరమేశ్వరునిపై భక్తిభావంతో పరవశించిపోయింది. 'ఓం నమ:శివాయ'.. నామ స్మరణలతో ఆ ప్రాంతమంతా మారుమోగిపోయింది. మహాశివరాత్రి పండుగ దినాన్ని పురస్కరించుకుని.. కళామతల్లి ముద్దుబిడ్డ.. రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో టిఎస్సార్ పర్యవేక్షణలో మహాశివరాత్రి వేడుకలు అంబరాన్నంటిన సంబరాలతో మహా సంరంభంగా జరిగాయి. ఒకవైపు భక్తజనం ఆ పరమశివుని స్మరించుకుంటూ జయజయధ్వానాలు చేస్తుండగా, మరోవైపు భక్తిభావ సమన్వితంగా సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తజనం పరవశించిపోయారు. శ్రీ శారదాపీఠం అధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. కళాబంధు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి స్వీయ పర్యవేక్షణలో ఈ వేడుకలు 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా ఆద్యంతం అద్భుతంగా సాగి అందరి కరతాళధ్వనులందుకున్నాయి. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా, ఏకధాటిగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం వేకువన 5 గంటల వరకు.. ఇరవై నాలుగు గంటల పాటు కమనీయంగా..రమణీయంగా.. నిర్విరామంగా సాగిన సంగీత, నృత్య, నాటక, ఆధ్యాతిక, సాంస్కృతిక కళా కార్యక్రమాల కోలాహలంతో విశాఖ సాగరతీరం హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమాల్లో ఆధ్యాత్మికత మూర్తీభవించిన ధార్మికవేత్త టిఎస్సార్ కనిపించినప్పుడల్లా భక్తులు, అభిమానులు పెద్దఎత్తున హర్షధ్వానాలు చేసి, టిఎస్సార్ అమోఘమైన కళాసేవను, నిరుపమానమైన ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. ఈ వేడుకలకు విశాఖ సాగరతీరంలో ఏర్పాటుచేసిన బృహత్తరమైన వేదికపై వై.శ్రీనివాస్ యాదవ్ బృందం 'శత గళార్చన' కార్యక్రమం వీనులవిందుగా సాగింది. సాయంత్రం జరిగిన వేడుకలో ప్రముఖ సినీనటులు సుమన్‌కు టిఎస్సార్ చేతుల మీదుగా 'ఆధ్యాత్మిక నట ప్రవీణ' బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. మరికొంతమందికి 'శివశక్తి' అవార్డులను అందజేశారు. వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందిస్తున్న ఇంకొందరు ప్రముఖులను కూడా ఈ వేదికపై సన్మానించి టిఎస్సార్ తన కళాభిమానాన్ని, సేవాభావం వున్నవారి పట్ల తనకున్న ఆత్మీయతను చాటుకున్నారు. ఈ పర్వదిన వేడుకల్లో భాగంగా, ప్రముఖ సంగీతజ్ఞుడు వాసూరావు సంగీత సారధ్యంలో జరిగిన భక్తిగీతాల కార్యక్రమం మనోహరంగా సాగి, అందరి ప్రశంసలనూ అందుకుంది. శుక్రవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ఈ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల సందడి శనివారం ఉదయం 5 గంటల వరకు నిర్విరామంగా సాగడం ఎంతైనా విశేషం. నటరాజ్ బృందం ప్రదర్శించిన 'మహాశివరాత్రి' నృత్యరూపకం, వంకాయల మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్యనాటక సన్నివేశాలు, ఉత్తరాంధ్ర పౌరాణిక సంక్షేమసంఘం సమర్పణలో సాగిన 'గయోపాఖ్యానం' పౌరాణిక నాటక ప్రదర్శన అన్నీ వేటికవే తమ ప్రత్యేకత సంతరించుకున్నవే. ఇలా ఎన్నో విశిష్టమైన కార్యక్రమాలతో విశాఖ సాగరతీరం మారుమోగిపోయింది. ఈ సందర్భంగా, సాగరతీరంలో ప్రతిష్ఠించిన శివలింగాలను భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని తరించారు. మహాశివరాత్రి పర్వదిన వేడుకలను వేడుకలకే వేడుక అన్నట్లుగా ఇంత వైభవంగా.. ఇంత పవిత్రంగా.. పుణ్యప్రదంగా నిర్వహించిన టిఎస్సార్‌కు భక్తజనం కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ఎనలేని భక్తి భావంతో మహాశివరాత్రి వేడుకలను మనోహరంగా..అద్భుతంగా నిర్వహించి ప్రజలందరి అభినందనలు అందుకున్న పరమశివుని భక్తుడు..అందరికీ ఆత్మీయుడైన మన సుబ్బరామన్నకు 'లాయర్' మన:పూర్వక శుభాకాంక్షలు!...

# పోర్టు పుణ్యం.. ఎయిర్‌పోర్టు ఎగిరిపోనుందా?



నెల్లూరుజిల్లా దగదర్తి మండలం దామవరం వద్ద హైవే పక్కన ఎయిర్‌పోర్టు... దివంగత నేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి హయాంలో పురుడు పోసుకున్న కల. ఎయిర్‌పోర్టు కోసం ఇక్కడ భూసేకరణ జరిగింది. సర్వే ముగిసింది, నిధులు మంజూరు కూడా అయ్యాయి. ఇక కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపనే తరువాయి అనుకుంటున్న తరుణంలో ఇక్కడ విమానాలు ఎగరడం మాట అటుంచి అసలు ఎయిర్‌పోర్టే ఎగిరిపోయిందని తెలుస్తోంది. ఎగిరి ఎక్కడికో పోలేదు, నెల్లూరు జిల్లాలోనే ముత్తుకూరు మండలంలో రిలయన్స్ పవర్ ప్రాజెక్ట్ కోసం సేకరించిన 2వేల628 ఎకరాల భూముల్లో ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం కానున్నట్లు సూచాయగా తెలుస్తోంది. దేశంలోనే పెద్ద పోర్టుగా, ఎగుమతులు, దిగుమతులలో దూసుకుపోతున్న కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం ఒత్తిడితోనే ఎయిర్‌పోర్టును అక్కడనుండి ఇక్కడకు మార్చినట్లు తెలుస్తోంది. కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా, పోర్టు వాణిజ్యానికి అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో పాటు, రిలయన్స్ కోసం సేకరించిన భూములు ఎలాగూ ఖాళీగా వున్నాయి కాబట్టి భూసేకరణ సమస్య కూడా లేకపోవడంతో ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపారని సమాచారం.

దామవరం వద్ద ఎయిర్‌పోర్టు అయితే నెల్లూరుజిల్లా ప్రయాణీకులతో పాటు ప్రకాశం జిల్లా ప్రయాణీకులకు కూడా అనువుగా ఉండేది. ముఖ్యంగా పడమర మండలాల వారికి చాలా సౌకర్యంగా ఉండేది. దామవరం అయితే హైవేకు పక్కనే ఉండడం, జిల్లాలోని అన్ని వైపుల నుండి హైవేలోకి మంచి కనెక్టివిటీ ఉండడం వల్ల ప్రయాణీకులకు సులువుగా ఉండేది. ఇప్పుడు రిలయన్స్ కోసం సేకరించిన భూముల్లో ఎయిర్‌పోర్టు పెడితే జిల్లాలో అదొక కొసన అవుతుంది. అదీగాక రోడ్డు కనెక్టివిటీ సరిగా లేదు. ఏ ప్రాంతం వాళ్లైనా నెల్లూరు, ముత్తుకూరు రోడ్డు ద్వారా అక్కడికి చేరుకోవాలి. ఇప్పటికే ఆ రోడ్డులో ట్రాఫిక్ నరకంగా వుంటుంది. ఇక ఎయిర్‌పోర్టు పడితే పెరిగే ట్రాఫిక్‌తో అరగంట ప్రయాణం ఒకటిన్నర గంట అయినా ఆశ్చర్యపోనవసరం లేదు.

అయితే ఒకటి నిజం... కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా ఎయిర్‌పోర్టు ఇక్కడ వస్తే ప్రయాణీకుల సౌకర్యం మాట అటుంచి, పారిశ్రామికాభివృద్ధికి అవకాశం ఉంటుంది. కృష్ణపట్నం పోర్టుకు ఎయిర్ కార్గో పెరుగుతుంది. పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలు రాకపోకలు సాగించడానికి అనువుగా వుంటే పరిశ్రమలు పెరగవచ్చు. రిలయన్స్ భూముల్లో ఎయిర్‌పోర్టు ఖాయమైతే ముత్తుకూరు రోడ్డులో రియల్ భూమ్ మళ్ళీ ఒక ఊపు ఊపొచ్చు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో కోటంరెడ్డి



ఈ నెల 2వ తేదీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని మినీబైపాస్‌లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ప్రతిష్ఠ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో హాయిగా ఉండాలని, కులమతాలకు అతీతంగా, రాజకీయ విభేదాలకు దూరంగా ఉండాలని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శ్రీధర్‌రెడ్డి కోరుకున్నారు.




## 'ప్రభా'తం

# అగ్రరాజ్యం... విద్వేషానికి ఆజ్యం

**అగ్రరాజ్యమైన అమెరికాలో పెచ్చరిల్లిపోతున్న జాత్యహంకారం ఒక అమాయక భారతీయ ఇంజనీర్ ప్రాణాలను బలిగొనడం దారుణం!.. అమెరికా అభ్యున్నతికి అహరహం కృషిచేస్తున్న భారతీయులకు ఇప్పుడక్కడ అభద్రతాభావం వుండడం బాధాకరం. ఇకనైనా ఆ తీరు మారాలి. జాత్యహంకార.. విద్వేషాగ్నులను వెంటనే చల్లార్చాలి. శాంతి-సామరస్యాలకు ప్రతీకలైన భారతీయులకు అమెరికా ఎల్లవేళలా ఆత్మీయమైన స్నేహహస్తం అందించాలి. అమెరికాలో విద్వేషాగ్నులు కాదు.. మానవత్వం గుభాళించాలి. మానవత్వంలోనూ అమెరికాయే అగ్రగామిగా నిలవాలి!**

అమెరికాలో ఇటీవల బాగా పెచ్చరిల్లిపోతున్న జాత్యహంకార విద్వేషపూరిత వాతావరణం చివరికి ఒక అమాయక భారతీయ ఇంజనీర్ ప్రాణాలను బలి తీసుకోవడం దారుణం. అమెరికాలో మెరుగైన అవకాశాలుంటాయని ఆశపడి ఖండాంతరాలకు వలసపోయిన తెలుగు యువకుడు కూచిభొట్ల శ్రీనివాస్‌ను జాతి విద్వేషం నరనరానా జీర్ణించుకుపోయిన ఒక దుండగుడు కాల్చి చంపడం ఘోరం.. ఘోరాతిఘోరం. ఇలాంటి విద్వేష పరిణామాలకి ఆజ్యం పోస్తున్న అమెరికన్ పాలకుల వైఖరి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురవుతోంది. అయినా... ఇదెక్కడి విద్వేషమో ఎవరికీ అర్థం కావడం లేదు. అందరినీ శత్రువుల్లా చూస్తే ఎలా?..అమెరికాలో ఉద్యోగాలన్నిటినీ ఇతర దేశాల వారు కొల్లగొడుతున్నారంటూ అమెరికన్లను రెచ్చగొట్టే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటలు విద్వేషాగ్నులు రగిలించేవారికి బాగా ఊతమిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

పొట్టచేతపట్టుకుని ఉపాధి కోసం మంచి అవకాశాలను వెదుక్కుంటూ దేశదేశాల నుంచి అమెరికా వెళ్ళిన వారికి ఈ విద్వేషాగ్నులు అనునిత్యం భయ కంపితుల్ని చేస్తున్నాయి. జాతి, మతం, వర్ణం, వర్గం, ప్రాంతాల భేదాలతో ఏదేశమైనా కునారిల్లిపోతే పెరిగేది విద్వేషమే తప్ప వికాసం కాదన్నది అందరికీ తెలిసిన సత్యమే. మనిషి గుణాన్ని నిర్వచించేవి నలుపు-తెలుపు రంగులు కాదు. మానవత్వం వుండడమే మనిషికి ప్రధానం. అయినా, తమకు ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పించి మంచి జీవితాలనిచ్చిన వారిపై మానవత్వం వున్నవారెవరైనా ఆత్మీయతను, అభిమానాన్ని పెంచుకుంటారే తప్ప.. ద్వేషంతో వుంటారా?.. అందులోనూ మంచికి-మానవత్వానికి, శాంతికి-సామరస్యానికి ప్రతీకలైన భారతీయులు ఎప్పుడైనా అలాంటి విద్వేషాల జోలికి వెళ్తారా?... ఎక్కడైనా విద్వేషాలకి బలైపోవడమే తప్ప, ఎవరిపైనైనా అలాంటి దుశ్చర్యలకు పాల్పడాలనే పాపిష్టి ఆలోచనలు భారతీయులకు ఏనాడైనా వున్నాయా?.. దాదాపు 32 లక్షల మందితో కూడిన భారతీయ అమెరికన్ సమాజం, మరో లక్షమంది విద్యార్థులతో అమెరికాలో వున్న భారతీయులు ఇప్పుడు అమెరికన్ పాలకుల విధానాలతో భద్రత కరువై అనునిత్యం సతమతమైపోతున్నారంటే పరిస్థితి అక్కడ ఎంత విషమంగా వుందో!.. భారతీయులంతా ఇప్పుడు భవిష్యత్తుపై బెంగతో అల్లాడిపోతున్నారు. అమెరికాలో విద్వేష మూకల సంఖ్య పెరిగిపోతుండడంతో ఎప్పుడు ఏ విపత్తు వచ్చిపడుతుందోనన్న భయంతో వణికిపోతున్నారు. అమెరికా అభ్యున్నతికి అహరం పనిచేసే భారతీయులు ఏనాడూ అమెరికాకు శత్రువులు కారు..కాలేరు. అయినా, తమకు ఎవరు శత్రువులో ఎవరు మిత్రులో అగ్రరాజ్యం తెలుసుకోకపోతే ఎలా?.. భారతీయులు అమెరికాకి ఇప్పుడే కాదు.. ఎప్పటికీ ఆప్తులే.. ఆత్మీయులేనన్న వాస్తవాన్ని అమెరికన్ పాలకులు గ్రహించడం అత్యవసరం. అమెరికాలో వుంటున్న భారతీయులకు స్నేహహస్తాన్నందించి అమెరికా మరింతగా ఎదగాలి.. సమున్నతంగా ఎదగాలన్నదే భారతీయుల ఆకాంక్ష. ఒకవైపు అమెరికాతో సహా..ప్రపంచాన్నే భయపెడుతున్న ఉగ్రవాదం కోరలు పెరికేయాలని, ప్రపంచాన్ని శాంతియుతంగా వుంచాలని..ఉగ్రవాదం నిర్మూలనకోసం ప్రపంచమంతా ఏకం కావాలని పిలుపునిచ్చే శాంతియుత భారత్‌ను రెండుచేతులా కావలించుకోవాల్సింది పోయి...భారతీయులపైనే విద్వేషంతో వుండడం ఎంత బాధాకరం?..

శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో ప్రపంచంలోనే అగ్రగామిగా వున్న అమెరికాయేనా ఇలా వుండాల్సింది?.. ఇంకా ఏ పురాతన కాలంనాటి ద్వేషాలు..విద్వేషాలు, జాత్యంహంకారాలనో పట్టుకుని వేలాడడం ఎంతవరకు సమంజసం?..ఎవరి తాటాకు చప్పుళ్ళకూ భయపడాల్సిన అవసరం అమెరికాకి ఇప్పుడే కాదు.. ఎప్పుడూ లేదు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశమైన అమెరికా..ప్రపంచానికే పెనుసవాల్‌గా నిలిచిన ఉగ్రవాదం వంటి దుర్మార్గాలను దునుమాడి, ప్రపంచానికి శాంతిని కాంతినీ కలిగిస్తూ..మానవాళికి మహోపకారం చేసే విధానాలతో ప్రపంచానికే మార్గదర్శకంగా వుండాల్సిన సమయంలో, ఇంకా జాతివిద్వేషాలతో కునారిల్లిపోవడం ఏమిటా అని ప్రపంచమే విస్మయచకితమవుతోంది. ప్రపంచంలో ఎన్నో పేదదేశాలున్నాయి.. పేదరికంతో అల్లాడిపోతున్నాయి. ఎంత ప్రతిభ వున్నా సరైన అవకాశాలు లేక దేశదేశాల్లో ఎంతోమంది యువత నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతిభకు పట్టం కడుతూ, ప్రగతిని అందలమెక్కించాల్సిన దేశంలో అభద్రతాభావం పొడచూపడమా?.. ఇది ఏనాటికీ మంచి పరిణామం కాదు. ఇప్పటికే కొన్ని దేశాలు ఉగ్రవాదభయంతో కంటికి నిద్రలేకుండా వున్నాయి. మరోవైపు వాతావరణ అసమతుల్యతలు, పర్యావరణ సమస్యలు భగ్గుమంటున్నాయి. ఇలా ప్రపంచవ్యాప్తంగా వున్న అశాంతిని పారదోలి, అగ్రరాజ్యంగా ఈ ప్రపంచానికి నేనున్నాంటూ తనవంతు పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన అమెరికాయేనా.. ఇలా విద్వేషాలకు నిలయంగా మారడమని అందరికీ వేదన కలిగిస్తోంది. అమెరికాలోని అత్యధికశాతం ప్రజలుకూడా మానవత్వంతో..ఇలాంటి విద్వేషాలను వ్యతిరేకిస్తున్నా అక్కడి పాలకులు పట్టించుకోకపోవడం మరింత దారుణం. అమెరికాలో శ్రీనివాస్‌పై దాడి జరిగినప్పుడు అడ్డుకోవడానికి ప్రయత్నించి గాయపడింది కూడా ఒక అమెరికన్ యువకుడే. ఆయన పేరు గ్రిలట్.. జాత్యహంకారంతో శ్రీనివాస్‌పై దాడి జరుగుతున్నప్పుడు అడ్డుకున్న మానవతావాది ఆయన. 'సాటి మనిషి కోసం ఏమి చేయాలో అదే నేనూ చేశాను' అని ఆయన సంతోషంగా అంటున్నప్పుడు ఆ మాటల్లో పరిమళించిన మానవత్వం ప్రపంచాన్నే గుభాళింపజేసిందంటే అతిశయోక్తి కాదు. అలాంటి మానవతావాదులున్న అమెరికాలో... జాత్యహంకారం ముసురుకోవడం మంచిది కాదు. ఇకనైనా ఆ తీరు మారాలి. అమెరికాలో విద్వేషాలు కాదు..మానవత్వం పెల్లుబుకాలి. విద్వేషాగ్నులను చల్లార్చి.. మానవత్వంలోనూ అమెరికాయే ప్రపంచంలో అగ్రగామి అనిపించాలి!...

# జాషువా రచనలు స్ఫూర్తిదాయకం

**- ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్**



తెలుగు సాహిత్యానికి జాషువా రచనలు తనకెంతో స్ఫూర్తినిచ్చాయని, జాషువా రచనలు సమాజానికి మార్గ దర్శకమని ప్రముఖ సాహితీవేత్త, భారత జ్ఞానపీఠ్ మూర్తిదేవి అవార్డు గ్రహీత కొలకలూరి ఇనాక్ అన్నారు.

ఫిబ్రవరి25న నెల్లూరులోని జాషువా కవితాపీఠం ఆధ్వర్యంలో, ఆ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ బూతపాటి కిరణశ్రీ సారధ్యంలో జరిగిన జాషువా అవార్డు సభలో ఆయన అవార్డు స్వీకర్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ఎంతో విశిష్టమైన జాషువ అవార్డును బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ సాహితీవేత్త శిఖామణి మాట్లాడుతూ, కొలకలూరి ఇనాక్ సాహిత్యమంటే తనకెంతో ఇష్టమని, నేటి యువరచయితలు, సాహితీవేత్తలు దళిత దృక్ఫథంతో ఇనాక్ రచనలను అధ్యయనం చేసి ఆ రచనల్లోని ప్రత్యేకతను గమనించాలన్నారు. అనంతరం, ఈ అవార్డు కింద కొలకలూరి ఇనాక్‌ను జాషువా కవితాపీఠం తరఫున 10 వేల నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇనాక్ మాట్లాడుతూ, ప్రజల జీవన స్థితిగతులను యధాతథంగా రచించబట్టే తన రచనలకు మంచి విశిష్టత వచ్చిందన్నారు.

ఈ సమావేశానికి కిరణశ్రీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, జాషువా కవితాపీఠం పేరుతో స్థాపించిన ఈ అవార్డును తొలిసారిగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేయడం తమకెంతో సంతోషంగా వుందన్నారు. ఈ సందర్భంగా జాషువా సాహితీ సమాలోచనం గ్రంథాన్ని ముఖ్య అతిధులు ఆవిష్కరించారు. ఇనాక్ రచనలపై ప్రముఖ కవులు ఈతకోట సుబ్బారావు, గుండాల నరేంద్రబాబు, చిన్నం రాజారాం ఉపన్యసించారు.

ఈ కార్యక్రమంలో జాషువా కవితాపీఠం ఉపాధ్యక్షుడు కొమ్మల కృష్ణయ్య, కార్యదర్శి కె.తిరుపాలురెడ్డితో పాటు, మెట్టు రామచంద్రప్రసాద్, చీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరుని

# హుండీ ఆదాయం 1.33 లక్షలు

మహాశివరాత్రి సందర్భంగా నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక హుండీలను ఫిబ్రవరి 25న లెక్కించగా, హుండీల ద్వారా స్వామివారికి 1,33,375 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. ఈ లెక్కింపులో ఆలయధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.




# రక్షణ కల్పించండి

అమెరికాలో ఉంటున్న భారతీయులకు రక్షణ కొరవడుతోంది. అన్నెంపున్నెం ఎరుగని కూచిబొట్ల శ్రీనివాస్‌ను ప్రాంతీయ విద్వేషంతో దారుణంగా చంపారు. భూతల స్వర్గం అని పేరున్న అమెరికా ఇప్పుడు భూతాల నరకంగా కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక కావడమే ఆ దేశానికి శాపంగా మారింది. ట్రంప్ మతిస్థిమితం లేని విధానాలతో అమెరికా పెద్దరికాన్ని పోగొట్టుకుంటోంది.

**కె.సుశీల, హైదరాబాద్.**

# వేశ్యలు ద్రోహులు కాదు

దేశాన్ని అమ్ముకుంటున్న రాజకీయ నాయకులకంటే, ప్రజా ధనాన్ని పుష్కరాలు, ప్రాజెక్టుల పేరుతో దోచుకునే ప్రజాప్రతినిధులకంటే వేశ్యలు ఎంతో నయం. వాళ్ళు మానాన్ని, అభిమానాన్ని అమ్ముకునన్నా డబ్బులు సంపాదిస్తారు. వేశ్యలు ఎక్కడన్నా దొరికితే టీవీలలో, పత్రికల్లో అదేపనిగా చూపిస్తారు. కాని, ఈ నాయకులు చేసే దోపిడీని ఏ మీడియా చూపించడం లేదు. మరీ ముఖ్యంగా మన రాష్ట్రంలో కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న తప్పుడు ప్రచారం చూస్తుంటే, వీళ్ళకంటే వేశ్యలే నయమనిపిస్తోంది. మరీ ఒక మీడియా సంస్థ అయితే సిగ్గు శరం వదిలేసినట్లుగా పని చేస్తోంది.

**నల్లు రాంకిరణ్, నెల్లూరు.**

# మండలికి ఎవరిని పంపాలి!

ప్రజాక్షేత్రంలో పోటీ చేసి గెలవలేని అనుభవజ్ఞులను, మేధావులను, ఆయా రంగాలలో ప్రముఖల సేవలను పరిపాలనలో ఉపయోగించుకునేందుకు గాను కేంద్ర స్థాయిలో రాజ్యసభను, ఆయా రాష్ట్రాల్లో శాసనమండళ్ళను ఏర్పాటు చేశారు. ఒకప్పుడు గౌరవప్రదమైన, అనుభవజ్ఞులైన వ్యక్తులనే పై సభలకు పంపేవాళ్లు. గత కొన్నేళ్ల నుండి ట్రెండ్ మారింది. పారిశ్రామికవేత్తలను, కార్పొరేట్ కంపెనీల అధిపతులను, వేలకోట్లు బ్యాంకులకు అప్పులు ఎగ్గొట్టిన వాళ్లను రాజ్యసభకు, శాసనమండలిలకు పంపిస్తున్నారు. ఇంకా విచారకరమైన విషయం ఏంటంటే ఒక్కో రాజ్యసభ సీటును 50కోట్లు, 100కోట్లకు అమ్ముకోవడం, ఎమ్మెల్సీ సీట్లను పదేసి కోట్లకు అమ్ముకోవడం. రాజకీయాల్లో ఇంతకంటే సిగ్గుమాలినతనం ఇంకొకటి ఉండదు. రాజ్యసభ శాసనమండలిలు వ్యాపారస్థులు, కాంట్రాక్టర్లు, పైరవీకారులతోనే నిండిపోతున్నాయి. కాబట్టి వీటిని రద్దు చేస్తేనే బాగుంటుంది. నరేంద్ర మోడీనే ఈ పని చెయ్యగలరు కూడా!

**కంచి సురేంద్రరెడ్డి, నెల్లూరు.**

## మాటమీద... నిలబడతాడా?

# నాలుక మడతపెడతాడా?

*ఉగాదికి మంత్రివర్గ విస్తరణ అంటున్నారు. అత్యవసరంగా లోకేష్‌ను మంత్రిని చెయ్యాలి కాబట్టి ఈసారి మంత్రివర్గ విస్తరణ చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే మంత్రివర్గ విస్తరణ అంటూ ఇప్పటికే ఎన్నో పండుగలను దాటేసారు. ఇప్పుడు లోకేష్ ఉన్నాడు కాబట్టి ఈ ఉగాదికి విస్తరణ మిస్ కాకపోవచ్చు.*

అయితే విస్తరణ కేవలం లోకేష్‌కు మాత్రమే పరిమితం అవుతుందా? లేక ఇంకొందరికి మంత్రి పదవులు లభిస్తాయా అన్న సంశయం ఇప్పటికి కూడా ఉంది. ఒకవేళ ఇంకొందరికి ఇస్తే అలాంటి లక్కీ పర్సన్స్‌లో ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఉన్నాడా? అన్నది ప్రశ్న!



రెండేళ్ల క్రితం జరిగిన ప్రకాశం జిల్లా స్థానిక శాసనమండలి ఎన్నికల్లో మాగుంట శీనయ్యను అభ్యర్థిగా చంద్రబాబే రంగంలోకి దించాడు. ఆ ఎలక్షన్‌లో పోటీ చేయాల్సిన అవసరం శీనయ్యకు లేదు. మూడుసార్లు ఎంపీగా గెలిచిన నాయకుడాయన. మాగుంట కుటుంబం మనిషి. ఎమ్మెల్సీ చిన్న పదవే! అయినా కూడా చంద్రబాబు మంత్రి పదవి ఆశపెట్టి నిలబెట్టాడు. ఆరోజు ప్రకాశంజిల్లా స్థానిక శాసనమండలి నియోజక వర్గంలో వైకాపాకే ఓట్లెక్కువ. అయినా శీనయ్య పోటీ చేసేసరికి అటు వాళ్లు కూడా ఇటొచ్చారు. శీనయ్య ఎమ్మెల్సీగా గెలిచాడు. ఇంతవరకు బాగానే వుంది. రెండేళ్ల నుండి ఆయన ఒట్టి ఎమ్మెల్సీనే! మంత్రి పదవి కల ఇంకా మిగిలే వుంది. రేపు విస్తరణ జరిగితే చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం శీనయ్యకు మంత్రి పదవిని ఇస్తాడా? ఇస్తే ఏ కోటాలో ఇస్తాడు, ఏ విధంగా ఆయన నుండి రాజకీయ ప్రయోజనాన్ని ఆశిస్తాడు? రెడ్ల వైపు నుండి తీసుకుంటే నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ప్రాధాన్యత కల్పించాల్సి వుంటుంది. ఇక్కడ మంత్రులుగా తీసుకునే రెడ్లు కూడా రాజకీయంగా ఉపయోగపడాలి. నెల్లూరుజిల్లాలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తీసుకుంటే రాజకీయంగా ఆ ప్రయోజనం ఉంటుంది. అలాగే కర్నూలు జిల్లాలో భూమా కుటుంబంలో నాగిరెడ్డికి గాని ఆయన కూతురు అఖిలప్రియకు గాని ఇవ్వక తప్పదు.

కేవలం ప్రకాశం జిల్లా రాజకీయాలను దృష్టిలో పెట్టుకునే మాగుంట శీనయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి. ఈ జిల్లా నుండి ఇప్పటికే సిద్ధా రాఘవరావు మంత్రిగా వున్నాడు. వైశ్య వర్గానికి చెందిన ఆయనను తొలిగించలేరు. తీసేయడానికి ఆయన మీద రిమార్క్‌లు కూడా లేవు. ప్రకాశం జిల్లా నుండి ఇంకొకరికి అవకాశం కల్పించాలనుకుంటే మాత్రమే మాగుంట శీనయ్యకు అవకాశం లభిస్తుంది. అది కూడా చంద్రబాబు తాను గతంలో శీనయ్యకు ఇచ్చిన మాటకు కట్టుబడితేనే!

## కింకర్తవ్యం...

# ఆదాలకు మొండి చేయి!

*నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటు కోసం చివరి దాకా ప్రయత్నించిన మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చంద్రబాబు మొండిచేయి చూపించాడు. మంత్రి నారాయణ, తనయుడు లోకేష్ అండదండలు దండిగా వున్న వాకాటి నారాయణరెడ్డినే అభ్యర్థిగా ఖరారు చేశారు.*

పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మరికొందరు నాయకులు కూడా ఆదాల ఎమ్మెల్సీ అయితే నెల్లూరులో మరో పవర్ సెంటర్ ఏర్పాటవుతుందని భావించి ఆయనకు సీటు రాకుండా అడ్డుకున్నారు. అదీ కాకుండా ఇప్పటికే జిల్లా నుండి ఎమ్మెల్సీలుగా వున్న నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలు నెల్లూరులో ఉండేవాళ్లే! కాబట్టి ఆదాలకిస్తే ఆయన కూడా నెల్లూరు చుట్టే తిరిగేవాడు. అదే వాకాటికిస్తే గూడూరు డివిజన్ కోటాలోకి వెళతాడు. నెల్లూరుకు రాకుండా ఆ సూళ్లూరుపేట చుట్టుపక్కల తిరుగుతుంటాడు... ఈ కోణంలోనే ఆయనకు అవకాశం వచ్చింది.



మరి వాకాటికన్నా ఆదాల ఎందులో వెనుకబడ్డట్లు? వాకాటి కంటే ముందే పార్టీలోకి వచ్చాడు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకుంటే ఆదాల పోటీ చేసాడు. ఉపఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి దాదాపు 3లక్షల మెజార్టీతో గెలిచిన ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మెజార్టీని ఆ ఎన్నికల్లో 13వేలకు దించాడు. ఒక దశలో మేకపాటిని ఓడించినంత పని చేశాడు. ఎంపీ అభ్యర్థిగా ఆదాల పోటీ చేయబట్టే తెలుగుదేశం కొంతన్నా పటిష్టమైంది. ఆదాల వల్ల తెలుగుదేశం గట్టిపడింది. మరి ఎన్నికల్లో ఓడిపోయాక ఆదాలకు పార్టీ ఏం ఇచ్చింది. రాజ్యసభకు పంపిస్తానన్న చంద్రబాబు హామీ పేలపిండిలాగా గాలికిపోయింది. నెల్లూరు పార్లమెంటుతో పాటు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా ఆయనను నియమించారు. వాటి వల్ల అధికారిక హోదా రాదు. చంద్రబాబు ఇస్తానన్న రాజ్యసభపై ఆశలు లేవు. ఈ దశలో ఎమ్మెల్సీ అన్నా ఉంటే బాగుంటుందని ఆదాల భావించారు. అందుకోసమే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రేసులోకి వచ్చాడు. ఈ సీటు తనకు కావాలని బలంగానే పట్టుబట్టాడు. కాని ఈ సీటు వాకాటికి ఎప్పుడో రిజర్వ్ చేసి పెట్టారు. లోకేష్ వద్దే దీని తంతు ముగిసింది. మొన్న నామినేషన్ల ముందురోజు దాకా ఆదాల పేరును కూడా పరిశీలిస్తున్నట్లు డ్రామా ఆడారు. చివరకు తమ మదిలో వున్న వాకాటి పేరునే బయటపెట్టారు. ఆదాల అడ్డం తిరక్కుండా ఆయనను బుజ్జగిస్తున్నారు. అదేదో నామినేటెడ్ పదవికి కూడా ఆశపెట్టారు. ఆదాలకు ఏ పదవి ఆశ చూపినా కూడా ఎమ్మెల్సీ సీటు విషయంలో మాత్రం వాకాటి ముందు ఆయనను చిన్నచూపు చూసినట్లే!

## కలెక్టర్ కోసం ఓ ఛాంబర్

# పెద్దాసుపత్రిపై స్పెషల్ కేర్



**అధికార యంత్రాంగాన్నంతా దారిలోకి తేవడం ఒక ఎత్తు... నెల్లూరులోని పెద్దాసుపత్రిని దారిలో పెట్టడం మరో ఎత్తు. ఏడు టన్నుల ఏరియల్ పౌడర్ వేసి ఉతికినా ఎలుక తోలు తెలుపు కాదు కదా... ఈ పెద్దాసుపత్రి అంతే... సాక్షాత్తూ... సీఎమ్మే వచ్చి ఇక్కడ కూర్చున్నా దారికి రాదు.**

ఇట్లాంటి పెద్దాసుపత్రిని దారిలో పెట్టడానికి జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు కంకణం కట్టుకోవడం అభినందనీయమే! పెద్దాసుపత్రికి పట్టున్న పెద్దరోగాన్ని వదిలించడానికి ఆయన పంతం పట్టాడు. ఈ ఆసుపత్రి రోగం ఏంటో అందరికీ తెలిసిందే! ఈ ఆసుపత్రి దేనికోసమైతే ఉందో ఆ పని నెరవేరడం లేదు. ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటున్న వైద్యులు సకాలంలో విధులకు రారు. నిర్ణీత టైం దాకా ఉండరు. రోగుల నాడి పట్టరు. ఉచితంగా మందులు ఇవ్వరు. ప్రాణాపాయస్థితిలో వున్న పేషంట్లే కాదు, జ్వరాలు, జలుబు వచ్చిన పేద రోగులు కూడా ఈ ధర్మాసుపత్రికి రాలేని పరిస్థితి. ధర్మాసుపత్రిలో ఇంత దరిద్రంగా ఉండబట్టే కూలీనాలీ చేసుకునే కష్టజీవులు కూడా ప్రైవేట్ ఆసుపత్రులకు పోయి రోగాలకు వేల రూపాయలు తగలేసుకుంటున్నారు. పెద్దాసుపత్రిలో వైద్యులు సక్రమంగా ఉండి రోగులకు శుద్ధంగా చూస్తుంటే పేద పేషంట్లకు ఎన్ని డబ్బులు మిగుల్తాయో!

జిల్లా కలెక్టర్ ముత్యారాజయితే ఒక మంచి ప్రయత్నమే చేస్తున్నారు. పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా తనకొక ఛాంబర్‌ను ఏర్పాటు చేయించుకుంటున్నారు. సాధారణంగా కలెక్టర్‌కు కలెక్టరేట్, క్యాంపు కార్యాలయాల్లో ఛాంబర్లు ఉంటాయి. కాని పెద్దాసుపత్రిలో కూడా ఆయన ప్రత్యేకగదిని పెట్టుకుంటున్నాడంటే ఈ ఆసుపత్రి మీద ఆయన ప్రత్యేకదృష్టి పెట్టబోతున్నాడని అర్ధమవుతోంది. ఇక నుండి కలెక్టర్ ఏ క్షణంలోనైనా పెద్దాసుపత్రికి వస్తాడు అన్న సంకేతాలు ఇప్పటికే అక్కడ సిబ్బందికి వెళ్లాయి. తీసుకుంటున్న జీతానికి సక్రమంగా పనిచేసే వాళ్లకైతే ఇబ్బంది లేదు. మేం పరీక్షలు వ్రాసి ఉద్యోగాలు తెచ్చుకున్నాం కాబట్టి ప్రభుత్వం జీతమిస్తుంది, ప్రజలకు సేవచేయడానికి కాదు అని ఉదాశీనంగా తిరిగేవాళ్లకు మాత్రం ఇక కష్టకాలమే!

# ఇంటలిజన్స్ ఏం చెప్పింది?



- ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై 'దేశం' నేతలు తీవ్ర అసంతృప్తి
- ఓడితే మంత్రి నారాయణ పరపతికి కాలం చెల్లినట్లే!



ఎన్టీఆర్ రద్దు చేసిన శాసనమండలిని 2004లో అధికారంలోకి వచ్చిన వై.యస్.రాజశేఖరరెడ్డి పునరుద్ధరించడం తెలిసిందే! అయితే ఆయన గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీలపైనే దృష్టి పెట్టేవాడు గాని పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలను పట్టించుకునేవాడు కాదు. ఎందుకంటే ఆయా నియోజకవర్గాల నుండి రాజకీయాలకతీతంగా విద్యావంతులు, మేధావులు ఎమ్మెల్సీలుగా రావాలని ఆయన కోరుకునేవాడు. కాబట్టే ఈ నియోజకవర్గాలకు ఆయన పార్టీ అభ్యర్థులను ఎప్పుడూ పెట్టలేదు.

కాని, చంద్రబాబు అలా కాదు. వీటిని కూడా రాజకీయ కోణంలో చూసేవాడు. వీటికీ పార్టీ అభ్యర్థులను నిలిపేవాడు. ఇలా గతంలో రెండుసార్లు తెలుగుదేశంపార్టీ తరపున అభ్యర్థులుగా నిలబడ్డ వాళ్లు చేతులు కాల్చుకున్నారు కూడా! వారిలో మనకు కనిపించే మొదటి బాధితుడు, సీనియర్ న్యాయవాది దేశాయిశెట్టి హనుమంతురావు. గత రెండు శాసనమండలి ఎన్నికల్లోనూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసినా ఓడిపోయాడు. ఆర్థికంగా నష్టపోయాడు. ఎదురుదెబ్బలు తిన్నా పార్టీని కనిపెట్టుకుని ఉన్నాడు. పార్టీ కోసం ఇంత నష్టపోయిన దేశాయిశెట్టినే ఈసారి కూడా పట్టభద్రుల నియోజకవర్గం నుండి నిలబెట్టుంటే కనీసం అతని మీద సానుభూతితోనన్నా ఓట్లు పడేవని, గెలుపు అవకాశాలెక్కువుగా ఉండేవని తెలుగుదేశం నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అభ్యర్థిగా పెట్టడాన్ని పార్టీలోని మెజార్టీ శాతం నాయకులు ఆమోదించడం లేదు. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని పట్టాభికి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాల్లో ఏ ఒక్క తెలుగుదేశం నాయకుడిని సంప్రదించకుండానే మంత్రి నారాయణ ఒత్తిడితో సీటిచ్చారు. ఈ మూడు జిల్లాల్లో టీడీపీ నాయకులెవరూ పట్టాభి గెలుపుకు చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. పట్టాభిని వాళ్ళు బలవంతంగా నెత్తిన రుద్దిన పేరంటంగానే భావిస్తున్నారు. పట్టాభికి పార్టీలో సీనియార్టీ లేదు. 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో ఉన్నోడే! అంతకుముందు పార్టీల జంపింగ్ బాగానే చేసి ఉన్నాడు. ఆయనకు ఉద్యమాలు చేసిన చరిత్ర లేదు. నిరుద్యోగుల కోసం పోరాడిన వాడు కాదు. పట్టభద్రులు పట్టాభికి ఓటేయడానికి ఒక్క సానుకూల పాయింట్ కూడా లేదు. ఇక చంద్రబాబు అందం, నారాయణ మందం చూసి ఓట్లేయాల్సా...?

ఇంటలిజన్స్ కూడా తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో అభ్యర్థులు వీక్‌గా వున్నారని చంద్రబాబుకు నివేదించినట్లు తెలుస్తోంది. దీంతోనే చంద్రబాబు మంత్రి నారాయణను అదిలించారని, గట్టిగా పనిచేయమని ఆదేశించాడని తెలుస్తోంది. ఉపాధ్యాయ నియోజకవర్గం సంగతి అటుంచితే పట్టభద్రుల నియోజకవర్గం పోతే మాత్రం మంత్రి నారాయణ ప్రతిష్ట మసక బారినట్లే!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు



## పరీక్షా కాలం...

మనకు ప్రతి ఏటా విద్యార్థులకు పరీక్షలు, దేవుళ్లకు తిరునాళ్లు మార్చి నెలలోనే మొదలవుతుంటాయి. మార్చి 1వ తేదీ నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలయ్యాయి. సంవత్సరం పొడవునా కార్పొరేట్ కాలేజీలనే సెంట్రల్ జైళ్లలో మగ్గిన విద్యార్థి ఖైదీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పరీక్షలు వ్రాస్తున్నారు. ఒక్కో పరీక్ష కాగానే ఒక్కో శిఖరం ఎక్కినట్లు హ్యాపీగా ఫీలవుతున్నారు. ఇంటర్ పరీక్షలతో నగరమంతా కూడా సందడి నెలకొంది. పరీక్షా కేంద్రాలన్నీ విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.

## ఎగ్జామ్ సెంటర్స్‌లో కలెక్టర్



జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఫిబ్రవరి 26న నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ముందుగా డి.కె.డబ్ల్యూ కళాశాల పరీక్షా కేంద్రాన్ని, ఆచారివీధిలో వున్న నారాయణ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని, స్టోన్‌హౌస్‌పేటలో వున్న ఆర్ఎస్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని, కొండాయపాళెం గేటు సమీపాన వున్న శాంతినికేతన్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

## మయూర్ ఎమ్మెల్సీ ప్రచారం



నెల్లూరు కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ఆదివారం తన డివిజన్ పరిధిలోని చింతారెడ్డిపాలెం, వావిలేటిపాడు, ధనలక్ష్మీపురంలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలుసుకుని తూర్పు రాయలసీమ పట్టభద్రులు మరియు ఉపాధ్యాయ నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, వాసుదేవ నాయుడుకు ఓట్లేసి గెలిపించాలని, రాష్ట్రాభివృద్ధి కోసం తపన పడుతున్న చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కృష్ణ, రాజు, భాను, రాధాకృష్ణారెడ్డి, వాసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జయభారత్‌కు 20 లక్షల విరాళం



నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌కు చెన్నై దొడ్ల వరదారెడ్డి, రుక్మిణమ్మ ట్రస్టు తరఫున స్వర్గీయ దొడ్ల సుబ్బరామిరెడ్డి జ్ఞాపకార్థం రూ.20లక్షల విరాళాన్ని ట్రస్టు సభ్యులు దొడ్ల రఘునాథరెడ్డి, లీలమ్మ దంపతులు ఫిబ్రవరి 27వ తేదీ అందజేశారు. హాస్పిటల్‌కు సంబంధించి వైద్య పరికరాలు, వెంటిలేటర్‌లు, ల్యాబ్ పరికరాలు, క్యాజువాలిటి బెడ్‌లు ఏర్పాటు కోసం ఈ విరాళాన్ని అందజేసినట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా జయభారత్ హాస్పిటల్ ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి హాస్పిటల్ వారు అందజేస్తున్న వివిధ సేవాకార్యక్రమాల గురించి వివరించి, ఉచిత కంటి ఆపరేషన్లు, డయాలసిస్ యూనిట్, ఐసియూ విభాగాలను ట్రస్టు సభ్యులకు చూపించారు. హాస్పిటల్‌ను సందర్శించిన దాతలు హాస్పిటల్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఉత్తరోత్తరా తమ సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ప్రధానకార్యదర్శి నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు గుర్రం సుధాకర్, డా॥ వేణుగోపాలరెడ్డి, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుడే సుర్రుమంటుంది

నిన్న కాక మొన్న పోయినట్లుంది ఎండాకాలం. అప్పుడే సుర్రుమంటోంది. గత ఏడాది చివర్లో పెద్దగా వర్షాలు లేవు. ఈ ఏడాది మొదట్లో అదిరిపోయే చలి కూడా లేదు. దాదాపు అక్టోబర్, నవంబర్ నెలదాకా ఎండలలోనే మగ్గాం. జనవరిలో కొంచెం చలనిపించింది. మొన్ననే శివరాత్రి కూడా పోయింది. ఎండలు మొదలయ్యాయి. రోజురోజుకు సెగ పెరుగుతోంది. వర్షాలు కూడా లేవాయా... ఈ సారి నీళ్లకు ఎన్ని అగచాట్లు పడాల్సి వస్తుందోనని జనం అప్పుడే భయపడి చస్తున్నారు.

## ఇన్‌ఛార్జ్ సిఇఓగా వసుమతి

జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జ్ సిఇఓగా జడ్పీ ఏఓ వసుమతిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డిని ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసిబి అరెస్ట్ చేయడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా వసుమతిని నియమించారు.

## పెరిగిన విజయ పాల ధరలు

నెల్లూరులోని విజయ డెయిరీ పాల సేకరణ, పాల అమ్మకం ధరలను మార్చి 1వ తేదీ నుండి పెంచారు. పాల సేకరణ ధరను గేదె పాలు కేజీ వెన్నకు ప్రస్తుత ధర 530 రూపాయలు కాగా 15 రూపాయలు కమిషన్ కలిపి 545 రూపాయలు చేసారు. అలాగే ఆవు పాలు కేజీ వెన్నకు ప్రస్తుత ధర 215 రూపాయలు కాగా, 15 రూపాయలు కమిషన్ కలిపి 230 రూపాయలు చేశారు. అలాగే బయట మార్కెట్‌లో 42 రూపాయలకు అమ్మే లీటర్ టోన్డ్ పాలను 44 రూపాయలకు, 50 రూపాయలకు అమ్మే హోల్‌మిల్క్ లీటర్ పాలను 52 రూపాయలకు పెంచారు.

## చార్టెర్డు అకౌంట్స్ జిల్లా అధ్యక్షుడిగా శేషయ్య



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరుజిల్లా శాఖ అధ్యక్షుడిగా ఏ.వి.శేషయ్య ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 150మంది సభ్యులున్న సంఘానికి 2017-18 ఏడాదికి బాధ్యతలను నిర్వహించనున్నారు. కార్యదర్శిగా లక్ష్మీప్రసన్న, ఉపాధ్యక్షుడిగా బి.శ్రీనివాసులు, కోశాధికారిగా ఐ.వంశీకృష్ణ ఎన్నికయ్యారు.



## ట్రాఫిక్... ఇక్కడ టెరిఫిక్

నెల్లూరు నగరంలో నుండి రూరల్ గ్రామాలకు వెళ్ళే పలు సెంటర్‌లు నిత్యం ట్రాఫిక్ రద్దీతో సమస్యలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా నగరంలో నుండి జొన్నవాడ, నరసింహపురం, పొట్టేపాలెం, తాటిపర్తి, ములుమూడి వంటి గ్రామాలకు మూలాపేట గేటు సెంటర్ మీదుగా వెళ్లాలి. ఇరుకళలమ్మ గుడి నుండి జొన్నవాడ పెన్నా వంతెన వరకు రోడ్డును నాలుగులైన్లు చేసారు. కాని, మూలాపేట గేటు మలుపు వద్ద వంతెన మాత్రం చాలా ఇరుకుగా ఉంటుంది. ఇది నాలుగురోడ్ల కలయిక కావడంతో వాహనాలు మలుపు తిరిగేటప్పుడు తరచూ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. అంతేకాకుండా ఇసుక రీచ్‌ల నుండి ఇసుక లోడ్‌తో వచ్చే ట్రాక్టర్ల వల్ల కూడా ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇక రూరల్ గ్రామాలకు వెళ్లే ఆటోలను కూడా ఈ మలుపు వద్దే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండడంతో వాహనాలు ఆగిపోతున్నాయి. ఇక్కడ వున్న వంతెనను వెడల్పు చేస్తే ట్రాఫిక్ సమస్య ఉండదు. వంతెనను ఇప్పటికిప్పుడు వెడల్పు చేయలేరు కాబట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేవరకు ఇక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను కీలక సమయాలలో ఖచ్చితంగా ఉండేటట్లు చూడాలి.

## విశాలాక్షికి డాక్టర్ రాజు విరాళం



గొలగమూడిలోని విశాలాక్షి వృద్ధాశ్రమానికి కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చేజర్ల శేషశ్రీనివాసరాజు 20వేల రూపాయల విరాళం అందజేసారు. సోమవారం తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రమాన్ని సందర్శించిన రాజు దంపతులు ఆశ్రమంలో వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సౌకర్యాల కోసం ఈ విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకులు కోసూరు రత్నంకు అందజేశారు.

## అవును... అతనిది హత్యే... మిస్టరీ ఛేధించాలి

నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్ లెక్చరర్స్ కాలనీ సమీపంలోని రైలు పట్టాలపై శవమై తేలిన సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ వీరభద్రందిది హత్యేనని పోస్ట్‌మార్టంలో వెల్లడైంది. దీంతో రైల్వే పోలీసులు ఈ కేసు దర్యాప్తును శాంతిభద్రతల పోలీసులకు బదిలీ చేయనున్నారు. ఇతని హత్య వెనుక కారణాలేంటన్నదానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. అతని హత్య వెనుక మిస్టరీని ఛేధించే ప్రయత్నం జరుగుతోంది.

సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్‌గా అతను అనేక ప్రభుత్వశాఖలలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలను ప్రశ్నించాడు. ముఖ్యంగా రెడ్‌క్రాస్ సంస్థల్లో చోటుచేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై పోరాటం మొదలెట్టాడు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలోనే ఎవరన్నా తమ అక్రమాలు బయటపడతాయని ఈ దారుణానికి ఒడిగట్టారా అన్న కోణంలోనూ అనుమానాలున్నాయి. లేక వ్యక్తిగత కారణాలు, కక్షల నేపథ్యంలో హత్య జరిగిందా అన్నది వెల్లడి కావాల్సివుంది.

## రెడ్‌క్రాస్ వైద్యశాలకు 5లక్షలు

నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ వైద్యశాలకు ఫిబ్రవరి 25న నెల్లూరులోని భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ వారు రూ.5లక్షల విరాళాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరుశాఖ కోశాధికారి మోహన్‌లాల్ జైన్ చేతుల మీదుగా ట్రస్ట్ కార్యదర్శి జెపిజైన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మహావీర్‌జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జెపిజైన్ మాట్లాడుతూ క్యాన్సర్ వైద్యశాలలో వైద్య సహాయం పొందుతున్న రోగుల్లో 98శాతం మంది ఎన్టీఆర్ వైద్యసేవ పథకం క్రిందేనని, డా॥ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం క్రింద ప్రభుత్వం చెల్లించే ప్యాకేజీలు 2013వ సంవత్సరంలో నిర్ధారించినవని, ప్రస్తుతం నిర్వహణ ఖర్చులు, మందుల ఖర్చులు బాగా పెరిగిపోవడంతో వైద్యశాల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. కొందరు దాతల విరాళాలు కొంతవరకు ఆదుకుంటున్నాయని, దాదాపు రూ.2కోట్ల విరాళాలు ఇవ్వడమే కాకుండా, నిత్యం నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న తమకు ఇక్కడి ఇబ్బందులు అర్థమవుతున్నాయన్నారు. పలువురు దాతలు ముందుకు వచ్చి ఈ వైద్యశాలకు ఎటువంటి ఆటంకాలు, ఆర్థికపరమైన ఇబ్బందులు రాకుండా విరాళాలిచ్చి ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో భగవాన్ మహావీర్‌జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చంపాలాల్ జైన్, పారస్‌మల్ జైన్, పుష్పరాజ్ జైన్, ఎస్పీ జైన్ పాల్గొన్నారు.

# మరో సంచలనానికి సన్నాహం



## మార్చి 31న జిఎస్ఎల్వి 09 ప్రయోగం

సతీష్ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి మార్చి 31న జిఎస్ఎల్వి-ఎఫ్09, ఏప్రిల్లో జిఎస్ఎల్వి-మార్క్3, పిఎస్ఎల్వి-సి38 ప్రయోగాలను నిర్వహించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 15న 104 ఉపగ్రహాల ప్రయోగంతో విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలు ఏకకాలంలో మూడురాకెట్ల అనుసంధాన పనులు చేస్తున్నారు. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ భవనం(వీఏబి)లో జిఎస్ఎల్వి-ఎఫ్09 అనుసంధాన పనులు జరుగుతున్నాయి. సాలిడ్ స్టేజి అసెంబ్లింగ్ బిల్డింగ్(ఎస్ఎస్ఏబి)లో జిఎస్ఎల్వి-మార్క్3 రాకెట్ అనుసంధాన పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఎస్-200, ఎల్-110, సి-25 అనే మూడు దశలకు భూస్థిర పరీక్షలను నిర్వహించి విజయవంతమయ్యాక ఆ దశలను అనుసంధానం చేస్తున్నారు. జిఎస్ఎల్వి-ఎఫ్09 రాకెట్ ద్వారా రెండు టన్నుల బరువైన జీశాట్-9, జిఎస్ఎల్వి మార్క్3 రాకెట్ ద్వారా నాలుగు టన్నుల బరువు కలిగిన జిశాట్-19 సమాచార ఉపగ్రహాలను రోదసిలోకి పంపేందుకు సన్నాహాలు ముమ్మరంగా చేస్తున్నారు. మొదటి ప్రయోగ వేదికపై వారంరోజుల్లో పిఎస్ఎల్వి-సి38 పనులను ప్రారంభించేందుకు కూడా సిద్ధమవుతున్నారు. ఇందులో దూర పరిశీలన ఉపగ్రహంతో పాటు వాణిజ్యపరమైన ఉపగ్రహాలు ఉండే అవకాశం వుంది.

# శ్రీసిటీ ఓ పారిశ్రామిక అద్భుతం

## - జపాన్ బృందం కితాబు



ఆరుగురు సభ్యులతో కూడిన జపాన్ వ్యవసాయ మంత్రిత్వశాఖ అధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. ఆ శాఖ రీజనల్ అఫైర్స్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ టొరుయు నేతృత్వంలో ఇక్కడకు విచ్చేసిన వీరికి శ్రీసిటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం సాదరస్వాగతం పలికి, సెజ్ మౌళిక వసతులు, ప్రత్యేకతలు, పారిశ్రామిక ప్రగతిని వారికి వివరించారు. శ్రీసిటీ గురించి పలు విషయాలను ఆసక్తిగా తెలుసుకున్న వారు, అనంతరం సెజ్ పరిసరాలను నేరుగా చుట్టి చూశారు. క్యాడ్బరీ, పయోలాక్స్ కంపెనీలకు వెళ్ళి అక్కడ కంపెనీ సీనియర్ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా టొరుయు మాట్లాడుతూ శ్రీసిటీ మౌలిక వసతుల పరిశీలనతో పాటు ఇక్కడ తమ దేశ కంపెనీల ఏర్పాటు, వ్యాపార సామర్థ్యం అంచనా వేయడమే తమ పర్యటన ఉద్దేశ్యమని తెలిపారు. థాయ్లాండ్లోను పలు పారిశ్రామికవాడలు చూసినవచ్చామని, వాటికన్నా శ్రీసిటీ చాలా బాగుందని ఆయన కితాబిచ్చారు. శ్రీసిటీ వ్యాపార సామర్థ్యాన్ని వివరించి, జపాన్కు చెందిన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు తాము సిఫార్సు చేస్తామన్నారు.

శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో ఆహార ఉత్పత్తుల రంగానికి సంబంధించి ఇండియా, జపాన్ దేశాల పారిశ్రామిక బంధం మరింత పటిష్టమై పలు పరిశ్రమలు రాష్ట్రానికి తరలి వస్తాయన్నారు. క్యాడ్బరీ, పెప్సీ, కెల్లాగ్స్, లవాజా, ఎనర్జన్టీ తదితర భారీ పరిశ్రమలతో పాటు మరిన్ని దేశీయ పరిశ్రమలతో శ్రీసిటి 'ఫుడ్ ప్రాసెసింగ్ జోన్'గా గుర్తింపు కలిగి వుందని, జపాన్ అధికారుల బృందం పర్యటనతో ఈ రంగంలో శ్రీసిటీకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీసిటీలో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి



ఓ వెనుకబడ్డ ప్రాంతాన్ని వరల్డ్క్లాస్ సిటీగా మార్చిన ఘనత శ్రీసిటీకి దక్కుతుందంటూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అలోక్వర్ధన్ చతుర్వేది వ్యాఖ్యానించారు. సోమవారం శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన ఆయన శ్రీసిటీ ఆర్థిక ప్రగతిపై సమీక్ష జరిపారు. శ్రీసిటీలో కోల్గేట్, రాక్వర్త్ పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తులను పరిశీలించారు. అలోక్వర్ధన్తో పాటు మద్రాస్ ఎక్స్పోర్ట్ ప్రాసెసింగ్ జోన్(ఎంఈపిజడ్) డెవలప్మెంట్ కమిషనర్ మరియు శ్రీసిటీ డిసి ఇన్ఛార్జి ఎం.కె.షణ్ముగసుందరం, ఎంఇపిజడ్ జాయింట్ డెవలప్మెంట్ కమిషనర్ డి.ఆనందన్ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# బోగస్ ఓట్ల తొలగింపు

శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో 6594 బోగస్ ఓట్లను అట్లాగే ఉపాధ్యాయ నియోజకవర్గంలో 200 బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. ఈ రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, యూటిఎఫ్ అభ్యర్థులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డిలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై హైకోర్టు గట్టిగా మందలించడంతో అధికారులు ప్రతి ఓటు దరఖాస్తును తిరిగి పరిశీలించి బోగస్ ఓట్లను గుర్తించారు. తెలుగుదేశంపార్టీ ఒత్తిడితో కొందరు తహశీల్దార్లు అనర్హులకు కూడా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలో ఓటు హక్కు కల్పించారు. డిగ్రీ సర్టిఫికేట్లు సమర్పించకుండానే కొందరిని, ఇంకొకరి డిగ్రీ సర్టిఫికేట్లతో దరఖాస్తు చేసుకొన్న మరికొందరిని కూడా పట్టభద్రుల ఓటర్ల జాబితాలోకి ఎక్కించి తహశీల్దార్లు తమ ప్రభుత్వ భక్తిని చాటుకున్నారు.

## సుబ్బరామయ్య సారథ్యంలో...

# షారూఖ్ఖాన్కి యశ్చోప్రా అవార్డు






రాజ్యసభ సభ్యుడు.. కళాకారులకు ఆత్మీయుడు టి.సుబ్బరామిరెడ్డి నెలకొల్పిన యశ్చోప్రా నేషనల్ ఫిల్మ్ అవార్డు ఎంతో ప్రతిష్ఠాత్మక పురస్కారంగా మారింది. పలువురు విఖ్యాతమైన సినీప్రముఖులు ఈ అవార్డును అందుకోవడంతో ఈ అవార్డుకు జాతీయస్థాయి ప్రతిష్ఠ ఏర్పడింది. ఈ ఏడాది ఈ విశిష్టమైన అవార్డును ప్రముఖ బాలీవుడ్ నటుడు షారుఖ్ఖాన్ అందుకున్నారు. ఫిబ్రవరి 25న ముంబైలో అద్వితీయంగా జరిగిన ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో టిఎస్సార్తో పాటు, మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్రావు, ప్రముఖ బాలీవుడ్ నటులు శత్రుఘ్నసిన్హా, రేఖ, మాధురిదీక్షిత్, పద్మిని కొల్హాపురి, ప్రముఖ సినీనటి జయప్రద తదితరులు పాల్గొని షారుఖ్ఖాన్ను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో పాల్గొన్న అనేకమంది సినీ దిగ్గజాలు, ప్రముఖులు ఈ సందర్భంగా సుబ్బరామిరెడ్డి చేస్తున్న కళాసేవను కొనియాడారు. అటు రాజకీయ రంగంలోనూ, ఇటు పారిశ్రామిక రంగంలోనే కాక, ఆధ్యాత్మిక-కళారంగాల్లో తనదంటూ విశిష్టమైన..అద్వితీయమైన స్థానాన్ని సాధించుకుని బహుముఖ ప్రజ్ఞావంతులుగా టిఎస్సార్ అందరి ప్రశంసలు అందుకుంటున్నారని అనేకమంది ప్రముఖులు ప్రశంసించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 4వ యశ్చోప్రా మెమోరియల్ నేషనల్ అవార్డు షారుఖ్ఖాన్కు లభించడం పట్ల సినీప్రముఖులు సంతోష సంరంభాలను వ్యక్తం చేశారు. షారుఖ్ఖాన్తో వున్న అనుబంధాన్ని, నటునిగా షారుఖ్ సాధించిన విజయాలను పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ సందర్భంగా టిఎస్సార్ మాట్లాడుతూ, ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును గతంలో సినీరంగంలో విశేషఖ్యాతి గడించిన ప్రసిద్ధ గాయని లతా మంగేష్కర్కు, విశ్వవిఖ్యాత బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, ప్రముఖ బాలీవుడ్ నటీమణి రేఖలకు ప్రదానం చేశామని, ఇప్పుడు మరో విశిష్ట నటుడు షారుఖ్ఖాన్కు ఈ అవార్డును ప్రదానం చేయడం తనకెంతో సంతోషంగా వుందని అందరి కరతాళధ్వనుల మధ్య అన్నారు.








## ఏప్రిల్ 8న షారుఖ్కు 'మిలీనియం స్టార్ అవార్డు'

### - హర్షధ్వానాల మధ్య టిఎస్ఆర్ వెల్లడి

ఈ సందర్భంగా టిఎస్సార్ మాట్లాడుతూ, ఏప్రిల్ 8న టిఎస్సార్-టివి 9 నేషనల్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహిస్తామని, ప్రముఖ బాలీవుడ్ నటుడు షారుఖ్ఖాన్కు ఆ వేడుకల్లో 'మిలీనియం స్టార్ అవార్డు'ను ప్రదానం చేస్తామని అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అందుకు షారుఖ్ఖాన్ కూడా ఎంతో సంతోషించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది సినీ ప్రముఖులు, సినీ నటులు, నటీమణులు, రాజకీయ-పారిశ్రామిక ప్రముఖులు పాల్గొన్నారు.



# కరువు నుంచి ప్రజలను కాపాడాలి

## జిల్లా కలెక్టర్‌కు పనబాక కృష్ణయ్య వినతి

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల కరువుబారిన పడిన మండలాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ నేత పనబాక కృష్ణయ్య అన్నారు. ఈ నెల 25న ఆ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ ముత్యాలరాజును కలసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి జిల్లా రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో మొత్తం 46మండలాలకు గాను కేవలం 27 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని, మిగిలిన మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు లక్షమంది ప్రజలు పొట్టచేతపట్టుకుని జీవనాధారం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారన్నారు. జిల్లాలో గ్రామీణ ఉపాధి పథకాన్ని బాగా అమలు చేస్తున్నట్లు కాగితాల్లో చెప్పుకుంటున్నా వాస్తవంలో ఆ పథకం లక్ష్యం నెరవేరడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, జన్మభూమి కమిటీల నాయకులు ఉపాధి హామీ పథకం నిధులను స్వాహా చేసేస్తున్నారని, అందుకు ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళ్ళడమే నిదర్శనమని అన్నారు. గ్రామీణ ఉపాధి పథకం పనులను గ్రామసభల్లోనే నిర్ణయించి అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు సివి శేషారెడ్డి, సిహెచ్ దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, అసీఫ్‌పాషా, భవానీ నాగేంద్రప్రసాద్, ఫయాజ్, అనూరాధారెడ్డి, అమీన, శ్రీధర్‌రెడ్డి, కేశవనారాయణ, తిరుపయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా..

# శ్రీ మూలస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు





నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19వ తేదీ నుండి మార్చి 3వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిగాయి. గత నెల 19వ తేదీ ఆదివారం రాత్రి 7గంటలకు అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 3వ తేదీ శుక్రవరం ఉదయం జరిగిన ఏకాంతసేవతో ముగిసాయి. ప్రతిరోజు ఉదయం చప్పర ఉత్సవాలను నేత్రపర్వంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. 20వ తేదీ ఉదయం ధ్వజారోహణ, రాత్రి సింహవాహనం, 21వ తేదీ రాత్రి పురుషామృగ వాహనం, 22వ తేదీ శేషవాహనం, 23వ తేదీ వెండి రావణ సేవ, 24వ తేదీ గిన్నెభిక్ష, లింగోద్భవాభిషేకం, వెండి నంది సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ స్వామి అమ్మవార్లకు పాలాభిషేకాలు, పూలంగిసేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. 25వ తేదీ రాత్రి స్వామివారి కళ్యాణోత్సవం, గజవాహన ఉత్సవం జరిగాయి. 26వ తేదీ ఉదయం రథోత్సవం రమణీయంగా సాగింది. 27న పులివాహనం, 28న అలకలతోపు, 1వ తేదీ తీర్థవాది, ధ్వజావరోహణ, తిరిచ్చి ఉత్సవం, 2వ తేదీ దవనోత్సవం, 3వ తేదీ ఉదయం ఏకాంతసేవ ఉత్సవాలు కనుల విందుగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకుని విశేషపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు. ప్రతిరోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# మా అభ్యర్థులను గెలిపించండి

### - ఎమ్మెల్యే సునీల్‌కుమార్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలసి సోమవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చేవూరు విజయ మోహన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, కోటేశ్వర రావు, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు. కాగా సోమవారం గూడూరు మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవసేన పాఠశాలలో విస్తృతంగా తెలుగుదేశం అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేశారు.

## గూడూరు డివిజన్ వార్తలు

## చిల్లకూరు జాతీయ రహదారిపై

# వాహనాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న చిల్లకూరు ఎస్ఐ అంకమ్మ

చిల్లకూరు సమీపాన జాతీయ రహదారిపై సోమవారం ఎస్ఐ అంకమ్మ ఆధ్వర్యంలో ఇంటర్‌సెప్టార్ వాహనం సాయంతో వాహనాల తనిఖీ చేపట్టారు. మితిమీరిన వేగం, రహదారి నిబంధనలు పాటించకుండా, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. దాదాపు 50మంది వాహనచోదకుల నుంచి రూ.15 వేల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

# నీటి సమస్యను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

గూడూరు డివిజన్ పరిధిలోని మండలాలకు సాగునీరు, తాగునీటి కోసం రైతులు కష్టాలు పడాల్సివస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు కేశవరెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం వారు ధర్నా నిర్వహించి, ఏవో మాలకొండారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగుగంగ నుంచి 2టీఎంసీలు నీటిని గూడూరు డివిజన్‌లోని మండలాలకు విడుదలయ్యేలా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు శ్రీనివాసులురెడ్డి, సురేంద్రరెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణం

# వేగవంతం చేయాలి

### - ఎంపిడివో భవాని



ప్రతి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గూడూరు ఎంపిడివో భవాని తెలిపారు. గూడూరు పట్టణంలోని మండల వెలుగు కార్యాలయంలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ అజీమ్‌తో కలసి 'వెలుగు' సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లను ఖచ్చితంగా నిర్మాణం చేసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 'వెలుగు' ఏపిఎం సరిత, ఉపాధి ఏపీఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

# అభివృద్ధికి సహకరిస్తా...

### - ఎంపి వరప్రసాద్

గూడూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని తిరుపతి పార్లమెంట్ సభ్యుడు వి.వరప్రసాద్ అన్నారు. గూడూరు పట్టణంలోని ఎంపి కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆయన గూడూరు మున్సిపాలిటీ అభివృద్ధి విషయం కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తాగునీటి అవసరాలు, కండలేరు నీటి పారుదల సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అంశాలను కమిషనర్‌తో ప్రస్తావించారు. గూడూరుకు ఎంపి నిధులు రూ.25 లక్షలు ఇచ్చానని, ఇప్పుడు మరో రూ.25లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. రైల్వేబ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు.



గూడూరు చవటపాలెం జడ్పీ హైస్కూల్ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల జరిగిన సభలో మాట్లాడుతున్న డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్. వేదికపై స్కూల్ హెడ్‌మాస్టర్ పురందర్‌రాజు, ఉపాధ్యాయులు భాస్కర్, జి.వేణుగోపాల్, బలరామయ్య, ప్రసన్న, కవిత, నాగమణి, రేవతి కుమారి తదితరులు

## సిరామిక్ కళాశాలలో

# ఉత్సాహంగా నృత్యాలు

గూడూరు పట్టణంలోని సిరామిక్ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం రాత్రి ఉత్సాహభరితంగా నిర్వహించారు. కళాశాలలో 63వ వార్షికోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈటీవీ జబర్దస్త్ బృందం ఆది ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చమక్‌లు, నవ్వులు పూయిస్తూ నృత్యాలు, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 3.3.2017 నుండి
తేది. 9.3.2017 వరకు

ఈ వారము మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, మేషంలో కుజుడు, సింహ రాశిలో రాహువు, కన్యలో గురువు, ధను రాశిలో శని, కుంభంలో రవి బుధ కేతువులు, మీనంలో శుక్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

#### ముహూర్తములు

తేది 5 ఆదివారము ఉదయం గంట 6.32 నుండి గంట 8.04లోగా మీన లగ్నమున వివాహ ఉపనయనములు. తేది 8 బుధవారము ఉదయం గంట 10.10 నుండి గంట 12.0 వరకు వృషభ లగ్నమున గృహారంభ, వ్యాపార, వివాహములు. రాత్రి గంట 9.56 నుండి 12.0 లోగా వృశ్చిక లగ్నమున గృహప్రవేశ వివాహములు.

#### ఫాల్గుణమాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 3 | శుక్ర | పంచమి | ప॥ గం.12.59వ॥ |
| తేది. 4 | శని | షష్ఠి | ఉ॥ గం.10.41వ॥ |
| తేది. 5 | ఆది | సప్తమి | ఉ॥ గం.8.10వ॥ |
| | పిదప | అష్టమి | పూర్తిగ |
| తేది. 6 | సోమ | నవమి | రా॥ గం.3.34వ॥ |
| తేది. 7 | మంగళ | దశమి | రా॥ గం.1.25వ॥ |
| తేది. 8 | బుధ | ఏకాదశి | రా॥ గం.11.34వ॥ |
| తేది. 9 | గురు | ద్వాదశి | రా॥ గం.9.33వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటు వద్దు. ఉద్యోగులకు, యజమానులకు వర్కర్లతో సమస్యలుండగలవు. దూర ప్రయాణాల వల్ల శ్రమ ఉంటుంది. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. వారాంతంలో అనవసర ఖర్చులుండగలవు. ఆర్థికంగా బలపడడానికి క్రొత్త ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సౌఖ్యం కలదు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శాస్త్ర సాంకేతిక వైద్య రంగాల వారికి మంచి అవకాశాలు దొరకగలవు. ఉద్యోగ ప్రయత్నాలు దొరికే పరిస్థితి ఉన్నది. సమావేశాలు, చర్చలలో పాల్గొంటారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరకగలవు. కోర్టు కేసులందు అనుకూలత కలదు. షేర్ల యందు కొద్ది లాభాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో కొద్దిపాటి అభివృద్ధి, ఒక మోస్తరుగా ఆదాయముంటుంది.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. షేర్లు నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. వస్తు వాహన గృహ రిపేర్లు ఉంటాయి. బిల్డర్లకు, కాంట్రాక్టర్లకు ఆర్థిక ఒడిదుడుకులుంటాయి. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా వ్యవహరించండి. ఆరోగ్యం ఫరవాలేదు. ఉన్నత విద్యావకాశాలకు ప్రయత్నాలు చేస్తారు. అనుకున్న పనులు జరుపుకుంటారు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్య ప్రయత్నాలు చురుకుగా సాగుతాయి. ఇతరులతో చర్చలు సంప్రదింపులు జరుపుతారు. సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, ఉన్నత విద్యావకాశాలు పొందడం జరుగుతుంది. బిడ్డలతో కొద్దిపాటి సమస్యలు, ఇతరుల పరామర్శనలు చేయడం, దూర ప్రయాణాలు హఠాత్తుగా నిర్ణయం కావడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి వైపు సాగుతారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఇబ్బంది పరిస్థితుల్లో సర్దుకొనిపోవడం, బాకీ వసూళ్ళందు సంయమనం పాటించడం మంచిది. ఉద్యోగులందు పని సామర్థ్యం బాగుండి అధికారుల అనుకూలత బాగుంటుంది. స్థాన చలనము ఉండవచ్చును. జీవిత భాగస్వామితో విభేదాలు రావచ్చును. ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు లభించగలవు. స్థిరాస్తుల విషయంలో తొందరవద్దు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు స్థానమార్పులు, అధికారుల ఆదరణ ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి. షేర్లు పెట్టుబడి రంగాల వారికి కొద్దిపాటి లాభాలుంటాయి. దూరప్రయాణాలు నిర్ణయం కావడం, శుభకార్య పనులందు పాల్గొనడం ఉంటుంది. ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. బంధువర్గాలతో సంప్రదింపులు ఫలిస్తాయి. సోదరులతో కొద్దిపాటి విభేదాలుంటాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగ వర్గాలు ఇటు పబ్లిక్‌తోను అటు అధికారులతోను జాగ్రత్తగా మెలగాలి. ఖర్చులు ఒకదాని తరువాత ఒకటి ఏదో ఒక రూపంలో పైనబడుతుంటాయి. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. క్రయవిక్రయాల లావాదేవీలు వాయిదా పడటం మంచిది. చిన్న ఉద్యోగావకాశాలు దొరకవచ్చును. ఉన్నత విద్యావకాశాలు విద్యార్థులకు లభిస్తాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనవసరంగా ఇతరులచేత మాటలు పడవలసి రావచ్చును. శుభకార్య ప్రయత్నాలలో అనుకూల సంకేతాలుంటాయి. షేర్ల మీద లాభాలుండగలవు. ఉద్యోగులు, వ్యాపారులపై అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. ఋణ సమస్య కొంత వరకు పరిష్కారం కావచ్చును. నిరుద్యోగులకు అవకాశాలు సరిగా ఉండవు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

మంచి ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. స్థిరాస్తుల కొనుగోలు అవకాశాలు దొరకగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు, ప్రతిభ బాగుంటుంది. కోర్టు వ్యవహారాల వల్ల ఇబ్బందులుండే అవకాశాలున్నవి. ఉద్యోగులకు బాధ్యతలు పెరగడం, హోదా పెరగడం ఉంటుంది. వ్యాపార పరంగా ఒడిదుడుకులు, ఇబ్బందులుండవచ్చును. సామాన్య ఆదాయం ఉంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

రాజకీయ వర్గాల వారికి సమస్యలు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో చిన్న అవకాశాలు లభించగలవు. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది. అనవసర వ్యవహారాలలోకి లాగడానికి ప్రయత్నాలుండవచ్చును. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక స్థితి బాగుంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తుల లావాదేవీలందు జాగ్రత్తపడండి, లేకుంటే పేచీలు రావచ్చును. అవసరాలు, చెల్లింపులను వాయిదా వేసికొనడం మంచిది. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగి వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగార్థులు కొంత వేచి ఉండవలసి వస్తుంది. కోర్టు వ్యవహారాలలో కొంత ప్రతికూలత ఉంటుంది. గాయాలు తగలవచ్చును.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు మంచి కార్యసామర్థ్యం, అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఇతరులకు మాట, ధన రూపంలో సహాయ పడతారు. స్వల్పంగా అనారోగ్య బాధలుంటాయి. ముఖ్యమైన సమాచారం, పత్రాలు అందుకుంటారు. మంచి ఆలోచనలు, చక్కని ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగుతారు. అనుకున్న పనులు సవ్యంగా సాగుతాయి.

# ట్రంప్‌ను చెడగొట్టిన కేసీఆర్

శ్రీను గల్పిక

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్రమంత్రులు సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ పారికర్, అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడులు ఉన్నారు. అమెరికాలో జరిగిన ఎన్నారై శ్రీనివాస్ కూచిబొట్ల హత్యోదంతంపై వాళ్ళు సమావేశమయ్యారు. జరిగిన దారుణాన్ని అందరూ తీవ్రంగా ఖండించారు. దీనిపై అమెరికా ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని కూడా తీర్మానించారు. అమెరికాలో గతంలో ఎప్పుడూ ఇలాంటి దుర్మార్గాలు లేవు. దోపిడీలు, దొమ్మీలు ఉండేవి గాని, జాతి వివక్ష కారణంగా హత్యలు జరగలేదు. అమెరికాలో కూడా జాతి వివక్ష ఉందంటే ఇక ఈ ప్రపంచాన్ని ఆ దేవుడు కూడా కాపాడలేడు. ఈ జాతి వివక్షతకు అధ్యక్షుడు ట్రంపే కారణంగా కనిపిస్తున్నాడని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించాడు. అప్పుడు వెంకయ్యనాయుడు జోక్యం చేసుకుని... నో... అక్కడ జాతి వివక్షకు కారణం ట్రంప్ కాదు, మన తెలంగాణ సీఎం కేసీఆర్ అని అన్నాడు. ఆ మాటకు మోడీతో సహా అందరూ ఆశ్చర్యపోయారు. అమెరికాలో జాతి వివక్షకు కేసీఆర్ కారణమా... అదెలా అని ప్రశ్నించారు. అప్పుడు వెంకయ్య... ఇలా అంటూ అందర్నీ ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

2016వ సంవత్సరం. అమెరికా అధ్యక్షుడి ఎన్నికల సీజన్! అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ నుండి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ నుండి హిల్లరీ క్లింటన్ పోటీ పడుతున్నారు. పలు అంతర్జాతీయ వార్తా సంస్థల సర్వేలన్నీ కూడా హిల్లరీకే అధ్యక్ష పీఠం అని స్పష్టం చేస్తున్నాయి. ఈ తరుణంలో డొనాల్డ్ ట్రంప్ తన నివాసంలో పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యాడు. గత రెండు దఫాలుగా డెమోక్రట్లే అధికారాన్ని కైవసం చేసుకున్నారు. ఈసారి మనం గెలవకపోతే పరువు పోతుంది. కాని, సర్వేలు మాత్రం ఆ హిల్లరీ గెలుస్తుందని చెబుతున్నాయి. దీనిని మార్చే మార్గమే లేదా అని ట్రంప్ ప్రశ్నించాడు. అప్పుడు రిపబ్లికన్ పార్టీ ముఖ్యనేత ఫిడేల్ కంప్ లేచి... సార్, ఈ విషయంలో మనం ఇండియన్ నేతలను ఫాలో అయితే కొంచెం రిజల్ట్ ఉండొచ్చన్నాడు. ఎవరిని ఫాలో అయితే బెటర్ అని ట్రంప్ అడిగాడు. నాకు తెలిసి స్వల్పకాలంలో ప్రజలలో ప్రాంతీయ భావోద్వేగాలు రెచ్చగొట్టి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను ఫాలో అయితే బాగుంటుందని కంప్ సలహా ఇచ్చాడు. అంతే అప్పటికప్పుడు ఇండియా నుండి కేసీఆర్ ప్రసంగ సీడీలను ట్రంప్ తెప్పించుకున్నాడు. వాటిని ప్రతిరోజూ రోజుకొక గంట లెక్కన చూడసాగాడు. కేసీఆర్ ప్రసంగంలో ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు ట్రంప్‌ను బాగా ఆకర్షించాయి. ప్రియమైన తెలంగాణ బిడ్డలారా... సోనియాగాంధీని బజారు కీడ్చయినా తెలంగాణ తెచ్చుకొంటాం, తెలంగాణ కోసం ఛస్తాం, లేదంటే చంపుదాం, పంచుడో, దంచుడో... ఏదో ఒకటి తేలుద్దాం. ఆ ఆంధ్రోళ్లు దొంగలు, మన ఆస్తులను, మన ఉద్యోగాలను కాజేసింద్రు, వాళ్లను ఇక్కడ నుండి తరిమి తరిమి కొట్టాలి. హైదరాబాద్ నుండి ఆంధ్రోళ్లను వెళ్లగొడితే వారి ఇళ్లు, పొలాలు, స్థలాలు అన్నీ తెలంగాణ బిడ్డలకే... జాగో, బాగో... తెలంగాణ ఇవ్వకపోతే రక్తపుటేరులే... తెలంగాణ ఇస్తే చాలు... నాకు పార్టీ అక్కరలేదు, నా పార్టీని కూడా కాంగ్రెస్‌లో విలీనం చేస్తా... అంటూ కేసీఆర్ ఉపన్యాసం ఉంది.

ఇంకో సిడిలో తెలంగాణ ఇచ్చాక కేసీఆర్ ప్రసంగం... తెలంగాణ ఇచ్చేదానికి సోనియా గాంధీ ఎవరు... మనమే మన్నా అడుక్కున్నామా, తెలంగాణ ఏమన్నా ఇటలీలో వున్నవాళ్లబ్బసొత్తా... తెలంగాణ మన హక్కు... భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన ఎలిజిబిత్ రాణిని ఎవరూ అనుకోరు, స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ మహాత్ముడే మనకు ఆదర్శం. కాబట్టి తెలంగాణ ఇచ్చిన సోనియా కంటే తెచ్చిన నేనే గొప్ప అని కేసీఆర్ ఉపన్యాసం వుంది.

కేసీఆర్ ప్రసంగాలకు ట్రంప్ బాగా ఆకర్షితుడయ్యాడు. కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సభల్లో రెచ్చిపోయాడు. విద్వేష పూరిత ప్రసంగాలు చేయసాగాడు. తాను అధ్యక్షుడినైతే అమెరికాలో ఉద్యోగాలన్నీ అమెరికన్‌లకేనన్నాడు. మన ఉపాధి అవకాశాలను దోచుకుపోతున్న విదేశీయులను మెడపట్టి గెంటేస్తానన్నాడు. ఆయన ప్రసంగాలతో స్థానికులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా అమెరికాలో ఓటింగ్ సరళి మారింది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టిన ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించాడు.

అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ట్రంప్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం మొదలుపెట్టాడు. అంటే జాతి విద్వేషాలు రగిల్చి విదేశీయులను వెళ్లగొట్టడానికి పొగపెట్టాడు.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. వెంకయ్య వారితో... మన కేసీఆర్‌ను అతను ఆదర్శంగా తీసుకున్నాడు. కాబట్టే అమెరికా అలా మండిపోతోందన్నాడు. అప్పుడు మోడీ... ఆ తిక్క ట్రంప్ పూర్తిగా ఇండియన్ లీడర్స్‌ను ఫాలో కావడం కాదు, కాబట్టే అలా తయారయ్యాడు. నా దగ్గర కేసీఆర్ ప్రసంగానికి సంబంధించిన సి.డినే ఒకటుంది. మీరు వెంటనే అమెరికాకు వెళ్లి ఆ మెంటలోడికి ఆ సి.డి చూపించండి. అతనిలో కొంతన్నా మార్పు రావచ్చని చెప్పి వెంకయ్య చేతికి ఒక సి.డి ఇచ్చాడు. దానిని తీసుకుని సుష్మాస్వరాజ్, వెంక య్యలు అమెరికా బయలుదేరారు.

★★★★★

వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్, అతని మంత్రులు వున్నారు. వెంకయ్య, సుష్మాస్వరాజ్‌లు తాము తీసుకెళ్లిన కేసీఆర్ స్పీచ్ సి.డిని అతనికిచ్చారు. ట్రంప్ ఆ సి.డిని ప్లేయర్‌లో పెట్టి ఆన్ చేశాడు. టీవీ స్క్రీన్ మీద కేసీఆర్ స్పీచ్ సీన్...

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆంధ్రోళ్లు ఎక్కువగా వుంటున్న కూకట్‌పల్లి ఏరియాలో తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రసంగం... ఇండియాలో ఉన్న వాళ్లంతా ఇండియన్స్ అయినప్పుడు, హైదరాబాద్‌లో ఉన్న మనమంతా హైద్రాబాదీలం కాలేమా... మూసీ నది నీళ్లు తాగేవాళ్లంతా అక్కచెల్లెల్లయినప్పుడు... మందాకిని వైన్స్‌లో మందు తాగే వారిమంతా అన్నదమ్ములం కాలేమా... కుల మత ప్రాంతాలకు అతీతంగా మనమంతా ఒక్కటే... ఆంధ్రోళ్లకు నేను అన్నగా ఉంటా... అండగా ఉంటా... ఆంధ్రోళ్లంతా నా తమ్ముళ్ల లాంటి వాళ్లు... మీ ఆస్తులకు, మీ ప్రాణాలకు నేను కాపలాగా ఉంటా... ఎవరన్నా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడితే వారి అంతు చూస్తా... అంటూ కేసీఆర్ ప్రసంగం ముగించాడు.

ఆ ప్రసంగం విని ట్రంప్ నోరు తెరిచాడు. అప్పుడు వెంకయ్య... మీరు ఇండియన్ లీడర్స్‌ను ఫాలో కావాలంటే పూర్తిగా ఫాలోకండి... మీరు కేసీఆర్‌ను ఎన్నికల పార్ట్ వరకే అనుసరించారు. ఎన్నికల తర్వాత కూడా అతని శైలిని అనుసరించి వుంటే ఈరోజు అమెరికాలో ఇన్ని అనర్థాలు జరగవు. ఒకటి గుర్తుంచుకోండి.. వాగ్దానాలనేవి ఎన్నికల్లో చెప్పడానికే గాని ఆచరించడానికి కాదు... మా ఏపికి ప్రత్యేకహోదా మాదిరిగా అంటూ అక్కడ నుండి లేచాడు.

## కళ్యాణ వైభవం...!



నెల్లూరులో ఎస్.ఐగా, సి.ఐగా సుదీర్ఘకాలం పని చేసి అందరికీ సుపరిచితుడై, ప్రస్తుతం నెల్లూరు ఆర్టీసీ డిఎస్పీగా పని చేస్తున్న వై.జయరామసుబ్బారెడ్డి - శ్రీదేవిల కుమారుడు **శ్రీకాంత్‌రెడ్డి - శృతి** (హైదరాబాద్ వాస్తవ్యులు ఐఆర్ఎస్ అధికారి కారెడ్డి వెంకటబ్రహ్మానందరెడ్డి - సునీలల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 1వ తేదీ హైదరాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



యాక్ట్ ఛానెల్ ఆపరేషన్స్ హెడ్ బొమ్ము వెంకటసుబ్బారావు - ప్రమీలారాణిల కుమార్తె **స్వాతి - నరేన్** (పశ్చిమగోదావరి జిల్లా కొప్పర్రు వాస్తవ్యులు అందె ఉదయభాస్కర్‌రావు - లక్ష్మీ సారంగపాణిల కుమారుడు)ల వివాహం ఈ నెల 1వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



## కావలి కబుర్లు

# మంచితనమే... ముంచుతుందా?

- పార్టీ అధికారంలో ఉన్నా కేడర్‌లో నిరుత్సాహం
- లోపాలను గుర్తించ లేకపోతున్నారని ఆవేదన

రాజకీయాలలో అంత మంచితనం పనికిరాదు, మంచితనానికి తోడు కొంత కఠినత్వం కూడా అవసరం. స్వతహాగా మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావుకు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోనే మంచివాడు, సౌమ్యుడు అనే పేరుంది. ఆ మంచి తనమే గత ఎన్నికలలో నిలువునా ముంచింది. మళ్ళీ అదే మంచితనం కనబడుతుందని ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉంటే ఉత్సాహంతో పనిచేయాల్సిన తెలుగు తమ్ముళ్లు కావలి నియోజక వర్గంలో అందుకు భిన్నంగా నిరుత్సాహంతో, అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు కమిటీల ఎన్నికల్లో కార్యకర్తల అసహనం బయటపడుతుంది. కారణం పార్టీలోని ద్వితీయ, తృతీయ శ్రేణి కార్యకర్తలపై ఆయన దృష్టి సారించకపోవడమేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో నాయకులు చిన్నా పెద్దా తేడా లేకుండా కలసిపోవాలి. అందుకు భిన్నంగా నియోజకవర్గంలో ఆ నలుగురితోనే మాట్లాడుతూ వెళ్లిపోతుండడంతో కార్యకర్తలలో అసంతృప్తి వెలువడుతుందని సమాచారం. క్రింది స్థాయిలో సమస్యలను ఆయనకు తెలుపకపోగా పక్క దారి పట్టిస్తున్నారని వినికిడి. నాయకుడు వచ్చినప్పుడు మాత్రమే అక్కడ హడావిడి చేసే కొందరు... ఆయన వెళ్ళిపోయాక ఏకంగా అధినాయకుని పైనే విమర్శలు చేయడం నిజమైన అభిమానులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తుండడంతో ఏ క్షణం ఏమి జరుగుతుందోనని మదన పడుతుండటం గమనార్హం. పార్టీలో ఏ కార్యక్రమం నిర్వహించినా అందరితో కలసి చర్చించకపోవడం, మండలాలలో , పట్టణంలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తలను పట్టించకోకుండా ఒంటెద్దు పోకడతో ఉండడంతో క్రింది స్థాయిలో పార్టీ పట్ల అసహనంగా ఉన్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గంలో ఏ నాయకులు ఎక్కడ పని చేస్తున్నారు, లోపం ఎక్కడ ఉంది, కార్యకర్తలు ఎందుకు అసంతృప్తిలో ఉన్నారో తెలుసుకొని సరి చేయాల్సిన అధినాయకత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కార్యకర్తలకు- నాయకులకు మధ్య మరింత దూరం పెరిగేందుకు దోహద పడుతుంది. ఇక రెండు సంవత్సరాలలో ఎన్నికలు రాబోతున్నాయి కాబట్టి నాయకులు క్షేత్ర స్థాయిలో సమస్యలను సరిచేసి వారి మంచి, చెడులకు నేనున్నాననే భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే పార్టీపట్ల విధేయులుగా ఉండేందుకు ముందుకు వస్తారని పలువురు తెలియజేస్తున్నారు . పార్టీలో ఆ నలుగురే అనే అభిప్రాయం వీడనాడి అందరూ సమానులే , ప్రతి ఓటరు పార్టీకి అవసరం అనే విధంగా ముందుకు వెళ్లాలని మరికొందరు కోరుతున్నారు.

ఇప్పటికైనా నియోజకవర్గంలో ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకొని, లోపాలను గుర్తించి పార్టీకి నష్టం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటే బీదాకు తిరుగులేదు. కావలి నియోజకవర్గం రాబోయే రోజులలో టీడీపీకి కంచుకోటగా నిలుస్తుందని విశ్లేషకుల అంచనా...!

# ఆలయాలు.. ఆధ్యాత్మిక గోపురాలు

**- మంత్రి కామినేని శ్రీనివాస్**



మన ఆలయాలు పరమ పవిత్రమైనవని, ఆధ్యాత్మిత్వానికే అవి కట్టిన గోపురాలని, ఆలయాల అభ్యున్నతికి ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి డా. కామినేని శ్రీనివాస్ అన్నారు. గూడూరులోని జివిస్ కల్యాణ మండపంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో పాల్గొని శ్రీ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల పరిరక్షణ సేవా సమితి నూతన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలోని దళిత, గిరిజన దేవాలయాలకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన రాయితీలను వచ్చేవిధంగా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ మాట్లాడుతూ, దళిత, గిరిజనుల ప్రాంతాల్లో వున్న దేవాలయాల్లో ధూపదీపనైవేద్యాలకు కొరత లేకుండా, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలను ఇప్పించేందుకు, తద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు తనవంతు సేవలందిస్తానని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక భావాలకు పట్టుగొమ్మలైన ఆలయాలను మరింతగా అభివృద్ధి చేయాలని, ఆ ఆలయాల్లో నిత్యపూజలు నిర్వహిస్తుంటే ఆ భగవంతుని ఆశీస్సులతో పాడిపంటలు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. పేదలు భక్తితో కొలుచుకునే దేవాలయాల అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కె ఆంజనేయరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, ఆధ్యాత్మికవేత్త గొడవర్తి సుబ్బానాయుడు, శ్రీ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల పరిరక్షణ సేవాసమితి అధ్యక్షుడు ఆరుమూళ్ళ మురళి, బిజెపి నాయకుడు సంజీవనాయుడు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# 7 నుంచి రంగనాథుడి తిరునాళ్ళు



నెల్లూరు రంగనాయకులపేట పినాకినీ నదీ తీరాన వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 7వ తేదీ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 8న ధ్వజారోహణ(తిరుచ్చి), శేషవాహనం, 9న సూర్య ప్రభ, హంసవాహనం, 10న సింహ వాహనం, చంద్రప్రభ, 11న పల్లకీ సేవ, హనుమంతసేవ, 12న బంగారు గరుడసేవ, 13న పూలంగిసేవ, కళ్యాణ మహోత్సవం, 14న రథోత్సవం, పుష్ప వాహనోత్సవం, 15న అశ్వవాహనం, 16న ముసుగుల సేవ, పుణ్యకోటి విమానం, 17న పుష్పయాగం, దవనోత్సవం, ధ్వజావరోహణం, 18న తెప్పోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# డాక్టర్ సి.ఆర్.రెడ్డి జన్మదిన వేడుక





డాక్టర్ సి.ఆర్.రెడ్డి 89వ జన్మదినాన్ని పురస్కరించుకుని గూడూరు సి.ఆర్. మార్టులోని ఫంక్షన్‌హాల్లో బుధవారం జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, వైజేపి లయన్స్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ నెట్ సిబ్బంది, పలువురు పట్టణ ప్రజలు రక్తదానం చేశారు.

# మాతృభాషను పరిరక్షించుకోవాలి

## - ప్రముఖ కథారచయిత వేదగిరి రాంబాబు

మాతృభాషను అందరం పరిరక్షించుకోవాల్సివుందని, మాతృభాషను పరిరక్షించుకున్ననాడే సాహిత్యం అందరికీ చేరువవుతుందని ప్రముఖ కథా రచయిత వేదగిరి రాంబాబు అన్నారు. ఫిబ్రవరి 25న నెల్లూరులోని వీఆర్ కళాశాల ప్రాంగణంలో నెరసం ఆధ్వర్యంలో, వివిఎస్‌యు సెమినార్‌హాల్‌లో 'సమాజ హితం.. సాహిత్య పథం' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సమాజంపై మంచి అభిమానం.. ప్రేమ వున్నవారు, సమాజాభ్యున్నతికి కృషి చేసే వారే మంచి రచయితలు కాగలరన్నారు. సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) సేవలను ఆయన కొనియాడారు. వివిఎస్‌యు ఉపకులపతి వీరయ్య మాట్లాడుతూ, సమాజంలోని దురన్యాయాలను ఎదిరిస్తూ సమాజ సంస్కరణలకు బాటలు వేసేందుకు నాటి కవులు, రచయితలు చేసిన రచనలు ఎంతో ఆదర్శవంతమైనవని, మార్గదర్శకమైనవన్నారు. ఈ కార్యక్రమంలో నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి పాతూరు అన్నపూర్ణతో పాటు ప్రముఖ కథా రచయిత్రి సోమిరెడ్డి జయప్రద, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త, కథా రచయిత వేదగిరి రాంబాబును నెరసం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

# శివ నామస్మరణం.. పరమ పుణ్యప్రదం

## - ప్రముఖ అవధాని కోట రాజశేఖర్



'శివ' అనే పదానికి శుభం, మంగళం అనే అర్థాలున్నాయని, శివనామస్మరణం ఎంతో శుభప్రదం..పుణ్యప్రదమని, అందులోనూ మాఘ బహుళ చతుర్దశి రోజున వచ్చే మహాశివరాత్రి పర్వదినాన ఆ పరమశివుని నామస్మరణం మరెంతో శుభకరమని ప్రముఖ సాహితీవేత్త, అవధాని కోట రాజశేఖర్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆయన అల్లూరులోని శివాలయంలో 'శివపురాణం' ప్రవచనం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు మరియు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మన గుడి' కార్యక్రమంలో భాగంగా ఈ ప్రవచనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన శివ పురాణం ప్రవచనాన్ని ఆద్యంతం భక్తజనరంజకంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. శివరాత్రి రోజున శివాలయానికి వెళ్ళడం, శివుని స్మరించుకోవడం, భక్తిశ్రద్ధలతో శివపంచాక్షరి జపించడం, అభిషేకాలు నిర్వహించడం, మారేదు దళాలతో ఆ పరమేశ్వరుని పూజించడం, కల్యాణవైభవాన్ని కన్నులారా దర్శించుకోవడం, శివపురాణాన్ని వినడం..వంటివన్నీ విశేష పుణ్యప్రదాలని ఆయన అన్నారు. సర్వపాప హరణమైన శివనామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయన్నారు. అష్టాదశ పురాణాల్లో ఒకటైన శివపురాణాన్ని వ్యాసమహర్షి 24వేల శ్లోకాలతో అత్యద్భుతంగా రచించారని, ఇదెంతో సనాతనమైన..విశిష్టమైన పురాణమని అన్నారు. ఇందులోని ముఖ్యమైన ఘట్టాల్లో దక్షయజ్ఞం, హాలాహల భక్షణం, గుణనిధి-గురుద్రుహుల కథలతో పాటు, లింగోద్భవకాలం..మహాశివరాత్రినాడు చేసే పవిత్రమైన పూజలు, అభిషేకాల విశిష్టతను ఆయన భక్తులకు సుబోధకమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా ఆయన శివానందలహరి, శ్రీకాళహస్తీశ్వర శతకం, శివమహిమ్న స్తోత్రాల్లోని ముఖ్యమైన శ్లోకాలను ఉదహరించి భక్తులను ఆకట్టుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఈ ఆలయంలో ఎంతో వైభవంగా జరిగే రుద్రాభిషేకాన్ని తిలకించడానికి భక్తులు వేకువనుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మేడా శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తలు కత్తుల రాధాకృష్ణయ్య, పచ్చబొట్ల సుబ్బయ్య, పెంట్యాల నాగరాజు, ఆలయ ఇ.ఓ రవీంద్రరెడ్డి, కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడు బడబాగ్ని అంజనేయరాజు, మాజీ ఇ.ఓ మాలకొండయ్య తదితరులు 'శివపురాణం' ప్రవచనకర్త రాజశేఖరావధానిని అభినందించి ఘనంగా సత్కరించారు.

# ఇంకెన్నాళ్ళు ఈ చెత్త పనులు

(మొదటి పేజీ తరువాయి)

"ఇంకెన్నాళ్ళు ఈ చెత్త పనులు..." అనే స్లోగన్‌తో ఈ మధ్య ఆర్టీసీ బస్సుల వెనుక ఓ ప్రకటన చూస్తున్నాం. రాష్ట్ర మున్సిపల్ శాఖ స్వచ్ఛభారత్ ప్రచారం కోసం ఇచ్చిన ప్రకటన అది. అందులో ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణల అందమైన ఫోటోలు కూడా ఉంటాయి. బహిరంగ మల, మూత్ర విసర్జన, వీధుల్లో చెత్త వేసుకోవడం, ఇంటి పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడమేనా చెత్త పనులు..? రాజకీయాలలో చెత్త పనులు లేవా? ఇప్పుడు స్వచ్ఛభారత్ అన్నది సమాజంతో పాటు రాజకీయపార్టీలకు, అందులోనూ తెలుగుదేశం పార్టీకి అవసరం. ఎందుకంటే తెలుగుదేశంలో జరిగేవన్నీ చెత్తపనులే!

స్వర్గీయ నందమూరి తారక రామారావు ఏ ఆశయాలతో అయితే తెలుగుదేశంపార్టీని స్థాపించారో, చంద్రబాబొచ్చి ఆ ఆశయాలను పూర్తిగా నీరుగార్చాడు. పార్టీలో ఒక సిద్ధాంతం లేదు, ఒక పద్ధతి లేదు, ఒక విలువ లేదు. సిన్సియార్టీకి గౌరవం లేదు, సీనియార్టీకి ప్రాధాన్యత లేదు. వీధుల్లోనే కాదు రాజకీయాల్లోనూ గుట్టలు గుట్టలుగా చెత్త ఉంటుందని చూపిస్తున్నాడు చంద్రబాబు. ప్రజల కోసం పనిచేసేవాళ్ళను కాకుండా తమ వ్యాపారాలు, కాంట్రాక్ట్‌ల కోసం పని చేసుకునే వాళ్ళను రాజకీయాలలో ప్రోత్సహిస్తున్నాడు. 'ఇంకెన్నాళ్ళు ఈ చెత్త పనులు" అని ప్రకటన చేస్తున్న మున్సిపల్ మంత్రి కూడా ఈ చెత్త సరుకులో తానుముక్కే! అసలు నారాయణ మంత్రి పదవికి అర్హుడా? చదువుల పేరుతో వేలకోట్ల వ్యాపారం చేసుకున్న నారాయణకు మంత్రి పదవి ఇవ్వడమేంటి? మూడేళ్ల క్రితం నెల్లూరులోని ఆయన ఆసుపత్రిలో నిర్మాణంలో వున్న భవనాలే కూలిపోయాయి. అలాంటి వ్యక్తికి రాజధాని నిర్మాణ బాధ్యతలు అప్పగించడమేంటి? పార్టీ కష్టనష్టాల్లో వున్నప్పుడు కనిపెట్టుకుని నిలబడ్డ సీనియర్ నాయకులను కాకుండా ఒక వ్యాపారవేత్తను మంత్రిని చేయడం చెత్త పని కాదా? మారిషస్ బ్యాంకుల్లో వేలకోట్ల అప్పులు ఎగ్గొట్టి, వారి నుండి నోటీసులు అందుకున్న సుజనాచౌదరిని రాజ్యసభకు పంపించడం, ఆ తర్వాత కేంద్రమంత్రిని చేయడం చెత్త పని కాదా? రాయపాటి సాంబశివరావు, సీఎం రమేష్‌లు, నామా నాగేశ్వరరావులు ఇదే బాపతు కాదా? కనీసం ఎమ్మెల్సీ అభ్యర్థులుగానన్నా పార్టీలోని సీనియర్ నేతలను నిలబెట్టకపోవడం చెత్త పని కాదా? బ్యాంకులకు వందల కోట్లు అప్పులున్న వాకాటికి నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటివ్వడం చెత్తపని కాదా?

ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను తెలుగుదేశంలో చేర్చుకోవడం చెత్తపని కాదా? వాళ్ళల్లో కొందరికి మంత్రిపదవులు ఇవ్వాలనుకోవడం చెత్త పని క్రిందకు రాదా? వైసిపి ఎమ్మెల్యేలను చంద్రబాబు తన పార్టీలో చేర్చుకోవడం ఎలా ఉందంటే పక్కవాడి పొలంలో పండిన పంటను మనం కోసుకుపోయినట్లుగా వుంది. చంద్రబాబు వైపు నుండి చూస్తే రాజకీయంగా ఇంకా చాలా చెత్తవుంది. ఆయన పరిపాలనలో అయితే మొత్తం చెత్తే!

"ఇంకెన్నాళ్ళు ఈ చెత్త పనులు" అంటూ చంద్రబాబు ప్రజలను ప్రశ్నించడం కాదు... ఈ చెత్త రాజకీయాలు ఇంకెన్నాళ్ళు అంటూ ప్రజలే చంద్రబాబును ప్రశ్నిస్తున్నారు. మేం చెత్తపనులు మానేస్తాం సరే... మీరు చెత్త రాజకీయాలను ఇకనన్నా మానుకోండని సలహా ఇస్తున్నారు. స్వచ్ఛభారత్ ప్రోగ్రాం సమాజంలోనే కాదు... అర్జంట్‌గా తెలుగుదేశంపార్టీలో కూడా అవసరమంటున్నారు.

# నా దారి... అడ్డదారి!

(మొదటి పేజీ తరువాయి)

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాక్షేత్రంలో కూడా దొడ్డి దారిగుండా పదవులు అనుభవించవచ్చు. రాష్ట్ర రాజకీయాలలో చంద్రబాబు వారసుడిగా వున్న నారా లోకేష్ కూడా ఇప్పుడు అదే దొడ్డిదారి పట్టాడు. త్వరలో మంత్రివర్గ విస్తరణ చేపట్టి లోకేష్‌కు మంత్రి కుర్చీ ఇవ్వనున్నారు. ఇందు కోసం ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని మొన్న జరిగిన టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో తీర్మానించారు.

రాజకీయాలతో సంబంధం లేని ఓ రిటైర్డ్ ఉన్నతాధికారినో, మేధావినో, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులనో మంత్రివర్గంలోకి తీసుకోవాలనుకున్నప్పుడు... (అంటే నారాయణ బోటోళ్లని) ఇలా ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే బాగుంటుంది. కాని లోకేష్‌ను మంత్రి వర్గంలోకి తీసుకోవడానికి ఇది సరైన మార్గం కాదు. ఎందుకంటే చంద్రబాబు తర్వాత తెలుగుదేశంపార్టీ బాధ్యత లోకేష్‌దే! ఇందులో సందేహం లేదు. పార్టీని నడిపించాల్సినవాడు ముందు ప్రజల నుండి ఎన్నిక కావాలి. ప్రజల్లో తన టాలెంట్‌ను, నాయకత్వ లక్షణాలను నిరూపించుకోవాలి. ప్రజల నమ్మకాన్ని పొందాలి. కనీసం ముందు ఒక అసెంబ్లీ సెగ్మెంట్ ప్రజలలోనన్నా తనను తాను నాయకుడిగా ఋజువు చేసుకోవాలి. ఈరోజు చంద్రబాబు తలిస్తే రాష్ట్రంలో ఏదో ఒక అసెంబ్లీ నుండి వున్న ఎమ్మెల్యే చేత రాజీనామా చేయించి లోకేష్‌ను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా గెలిపించడం పెద్ద సమస్య కాదు. లోకేష్ ప్రజల నుండి ఎన్నికైతే అతని నాయకత్వం మీద తెలుగుదేశం నాయకులకు కూడా నమ్మకం ఏర్పడుతుంది. ఇప్పుడు లోకేష్ అడ్డదారిలో ఎమ్మెల్సీ అయ్యి, మంత్రి పీఠమెక్కితే... అతని వరకు సరిపోతుంది. మరి రేపు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని నడిపించాలి. నాయకులను ఒప్పించాలి. ప్రజలను మెప్పించాలి. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా ఏ నాయకుడికైనా ఆ నేర్పు వస్తుంది. మరి అడ్డదారిలో గద్దనెక్కిన లోకేష్ రేపు పార్టీని ప్రజాయుద్ధంలో ఎలా గెలిపించగలడు.

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి తలచుకుని వుంటే తన కొడుకు జగన్‌ను రాజ్యసభకు పంపి కేంద్రమంత్రిని కూడా చేసుండేవాడు. కాని, ఆయన అలా చేయలేదు. 2009 ఎన్నికల్లో కడప లోక్‌సభ నుండి జగన్‌ను అభ్యర్థిగా నిలబెట్టాడు. ప్రజల్లో తిప్పాడు. ప్రజలతో కలవడం, మాట్లాడడం, వారి మనోభావాలను గుర్తించడం నేర్పాడు. కాబట్టే ఈరోజు ప్రతిపక్ష నాయకుడిగానైనా జగన్, ఈ రాష్ట్రంలో ఇంకే నాయకుడికీ లేనంత ప్రజాదరణ పొందగలుగుతున్నాడు. ప్రజలలో ఎన్నిక కావడం కంటే ఏ దారియి తేనేం పదవే ముఖ్యమనుకునే లోకేష్, చంద్రబాబు తర్వాత పార్టీనేం నడిపించగలడు?

# ఉత్కంఠ రేపుతున్న స్థానిక పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఆనం వాళ్ళు జంతర్‌మంతర్ చేసి గెలిపించారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి డిపాజిట్ కోల్పోయారు. ఆ తర్వాత అధికార తెలుగుదేశంలో చేరారు. చేరినప్పటి నుండి చంద్రబాబుకు చెక్కభజన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ పేరుమోసిన పారిశ్రామికవేత్త కమ్ ఎమ్మెల్సీ అయిన వాకాటి నారాయణరెడ్డి బ్యాంకులకు వందల కోట్లలో అప్పులున్నాడు. బాకీలు కట్టాలని బ్యాంకులు నెత్తి మీద పడితే చేతులెత్తేసే పరిస్థితి. ఆయన బ్యాంకు అప్పుల మీద మీడియాలో కూడా పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. వందలు, వేల కోట్లు బ్యాంకుల్లో అప్పులున్నవాళ్లంటే చంద్రబాబుకు మహా ఇష్టం. అందుకే వాకాటిని చేరదీసి ఎమ్మెల్సీ టిక్కెట్ ఇచ్చాడు. ఏళ్ల తరబడి పార్టీ జెండాలు మోసిన కార్యకర్తలు, నాయకులను కాదని వాకాటికే ప్రాధాన్యతనిచ్చారు.

నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డిని ఖరారు చేశారు. జిల్లా పార్టీ నాయకులతో సంప్రదింపులు జరిపిన అనంతరం పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి ఈమేరకు నెల్లూరు వచ్చి జిల్లా వైకాపా నాయకులతో సమావేశమై ఎన్నికల్లో విజయావకాశాలు, ఖర్చు తదితర అంశాలపై చర్చించారు.

నెల్లూరుజిల్లా స్థానిక ఎమ్మెల్సీని జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. మరో రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో ఇప్పటి నుండే పార్టీ శ్రేణులను ఉత్సాహపరచడానికి ఈ ఎన్నికలను ఒక మార్గంగా ఎంచుకున్నారు. అయితే జిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గంలో వైకాపాకు ఓట్లు తక్కువున్నాయి. 2014లో ఎక్కువమంది స్థానిక ఓటర్లు వైకాపా తరపున ఎక్కువ మంది గెలిచినప్పటికీ తర్వాత అధికారపార్టీ తెలుగుదేశంలోకి కొంతమంది వెళ్లిపోయారు. దీంతో ప్రతిపక్ష వైకాపా తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడానికి కొందరు సంకోచించారు. తొలుత పోటీ చేయడానికి ఉత్సాహం చూపినవాళ్ళు కూడా వెనకడుగు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికంటే డబ్బుతో కూడుకున్న పని... అలాగని గెలుపు గ్యారంటీ లేదు. ఈ దశలో జిల్లాలో బలమైన రాజకీయ కుటుంబమైన ఆనం కుటుంబానికి చెందిన ఆనం విజయకుమార్‌రెడ్డి పేరు పరిశీలనలోకి వచ్చింది. తన సోదరులు ముగ్గురు తెలుగుదేశంలో వున్నా ఆయన మాత్రం వైకాపాలో చేరారు. ఇప్పుడు వైసిపి స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడడానికి ముందుకొచ్చారు. పార్టీ శ్రేణులు గట్టిగా కృషి చేస్తే ఖచ్చితంగా తెలుగుదేశం నాయకుల్లో దడ పుట్టించగలడు.

ఇక ఆయన పరంగా చూస్తే ఇప్పటి దాకా తన రాజకీయ చరిత్రలో తన సోదరులను మోస్తూ వచ్చాడు. వాళ్ల ఎలక్షన్‌లకు ఇతను ఓటర్‌గా, కార్యకర్తగా, ఏజెంట్‌గా పనిచేశాడు. తొలిసారి ఆనం విజయకు ఎమ్మెల్సీ స్థాయి ఎన్నికలలో పోటీ చేసే అవకాశమొచ్చింది. కాని తన సోదరులు ముగ్గురూ తెలుగుదేశంలో వున్నారు. ఇప్పటి దాకా వాళ్లు ఇతని చేత పని చేయించుకున్నారు. తీరా ఇతనికి అవకాశం వచ్చేసరికి వాళ్లు విరోధులయ్యారు. మరి విజయకు పరోక్ష సహకారమన్నా అందిస్తారో లేదో? పార్టీలను పక్కనపెడితే వాకాటితో పోలిస్తే ఆనం విజయకే మంచి పేరుంది. ప్రస్తుతం అభ్యర్థుల వ్యక్తిత్వమే ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రధాన ప్రభావం చూపనుడడం విశేషం!

# జంపింగ్‌లకు ఝలక్






***భారత రాష్ట్రపతి, గవర్నర్‌లు మన ప్రజాస్వామ్య వ్యవస్థలో రబ్బరు స్టాంపులే! అయితే అన్ని వేళల్లో కాదు. తమకు అవకాశం వచ్చినప్పుడు వారు ఉగ్రరూపం దాలిస్తే ఆ పరిణామాలు వేరుగా ఉంటాయి. ప్రజల బ్రతుకులతో, సమాజం భవిష్యత్‌తో ఆడుకునే రాజకీయ నాయకులకు ముచ్చెమటలు పట్టించగల శక్తులు కేవలం రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారికి మాత్రమే ఉంటాయి. కనీసం వాళ్ళు అప్పుడప్పుడన్నా ఆ శక్తులను ఉపయోగిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటుచేసుకునే దారుణాలలో కొన్నింటినన్నా అరికట్టవచ్చు.***

చంద్రబాబు త్వరలో మంత్రివర్గ విస్తరణ చేపట్టాలనుకుంటున్న దృష్ట్యా రాష్ట్ర గవర్నర్ నరసింహన్ పాత్ర చాలా కీలకంగా మారింది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమైనప్పుడు గవర్నర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన తెలంగాణ ఉద్యమం సమయంలోనూ గవర్నర్‌గా నరసింహన్ చాలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు మరోసారి ఆయనకు తన సచ్ఛీలతను, రాజ్యాంగ స్ఫూర్తిని చాటుకునే సమయం వచ్చింది. చంద్రబాబు మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం పెట్టబోతున్నాడు. బహుశా ఉగాదే శుభ ముహూర్తం కావచ్చు కూడా! తన పుత్ర రత్నం లోకేష్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ఖాయం. అలాగే ఉన్నవారిలో ఓ నలుగురైదుగురిని పీకి వారి స్థానంలో సీనియర్లను తీసుకోవాలనుకుంటున్నారు. ఇంతవరకు ఎటువంటి అభ్యంతరాలు ఉండవు. వీరితో పాటు వైకాపా నుండి వచ్చిన ఎమ్మెల్యేలలో కూడా ఓ ముగ్గురు లేదా నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలనుకుంటున్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారమే వీళ్ళు తెలుగుదేశంలో చేరారు. ఆ కోటాలో భూమా అఖిలప్రియ, ఆకే అమర్‌నాథ్‌రెడ్డి, సుజయ్ రంగారావు, జ్యోతుల నెహ్రూ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే జంపింగ్ ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకోవడానికి గవర్నర్ నరసింహన్ మోకాలడ్డుతున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలోకి తీసుకోవాలనుకుంటున్న జంపింగ్ ఎమ్మెల్యేలు తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు చేయాలి. ఆమోదించుకోవాలి. ఆ తర్వాత మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, తెలుగుదేశం అభ్యర్ధులుగా గెలుపొందాలి. ఇదే జంపింగ్ జిలానీలకు గవర్నర్ ఇస్తున్న ఝలక్!

తెలంగాణలో జరిగిన అనుభవంతోనే గవర్నర్ నరసింహన్ ఈ నిర్ణయంపై గట్టిగా ఉన్నాడని తెలుస్తోంది. అక్కడ తెలుగుదేశం నుండి టీఆర్ఎస్‌లో చేరిన తలసాని శ్రీనివాసయాదవ్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. దీనిపై తెలంగాణ తెలుగుదేశం నాయకులు తీవ్ర రాద్ధాంతం చేసారు. మా పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే చేత మంత్రిగా ఎలా ప్రమాణస్వీకారం చేయిస్తారంటూ గవర్నర్‌పైనే ఆరోపణలు ఎక్కుపెట్టారు. ఆ తర్వాత అక్కడ తలసాని ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం జరిగింది. తలసానిని మంత్రివర్గంలోకి తీసుకోవడంపై తెలంగాణ తమ్ముళ్ళు హైకోర్టుకు కూడా వెళ్లారు.

తెలంగాణ వ్యవహారమే ఇప్పుడు చంద్రబాబుకు చిక్కుముడిగా మారింది. తలసాని విషయంలో చేసిన రాద్ధాంతమే ఇప్పుడు ఆయనకు ఇబ్బందిగా మారింది. తలసాని విషయంలో విలువలను ప్రశ్నించిన మీరు ఇప్పుడు వైకాపా ఎమ్మెల్యేలను ఎలా మంత్రివర్గంలోకి తీసుకుంటారని గవర్నర్ ప్రశ్నిస్తే చంద్రబాబు వద్ద సమాధానం ఉండదు. ఈ విషయంలో గవర్నర్ తన వైఖరికే కట్టుబడితే జంపింగ్‌లకు మంత్రి పదవులు దక్కడం అనుమానమే!

ఒకవేళ చంద్రబాబు విలువలకు కట్టుబడి జంపింగ్ ఎమ్మెల్యేల చేత రాజీనామాలే చేయించాదనుకుందాం... ఉప ఎన్నికల్లో తిరిగి వీళ్లు గెలవగలరా? అసలు ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రబాబు ఉప ఎన్నికలకు పోవడమంటే మురికిగుంటను వెదుక్కుని మరీ దూకడమే అవుతుంది.




ఫిబ్రవరి 28వ తేదీ నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసన మండలి నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వాకాటి నారాయణరెడ్డి, అలాగే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి.




స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం - 06.03.2001

16వ వర్ధంతి



పూజ్యులు

స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

స్వర్గస్తులై 06.03.2017 నాటికి పదహారు సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

గ్లోబల్ కాంట్రాక్టర్, రామ్మూర్తినగర్, నెల్లూరు.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com